గురువారం
14-03-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 262
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

## అహ్మద్‌నగర్ ఇక అహల్యానగర్

**ముంబై:** మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ పేరును అహల్యానగర్‌గా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నిర్ణయం తీసుకుంది. 18వ శతాబ్దపు మరాఠా రాణి అహల్యాభాయ్ హోల్కర్ పేరుతో అహ్మద్‌నగర్‌ను వ్యవహరించాలనే ప్రతిపాదనకు మహారాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది.

అహ్మద్‌నగర్ పేరు మార్చాలని మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే గత ఏడాది మేలో తొలిసారిగా ప్రతిపాదించారు. నిజాంషాహి వంశానికి చెందిన అహ్మద్ నిజాంషా పేరుతో 15వ శతాబ్దంలో ఈ నగరానికి అహ్మద్‌నగర్ పేరు పెట్టారు.

# గ్రూప్-1 మెయిన్స్ రద్దు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** గ్రూప్-1 మెయిన్స్ (2018) పరీక్షలను రద్దు చేస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. 2018లో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాలను చేతితో రెండు సార్లు మూల్యాంకనం చేశారంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టులో సవాల్ చేశారు. మొదటిసారి దిద్దిన ఫలితాలను పక్కనపెట్టి, రెండోసారి దిద్దించి, వాటి ఆధారంగా ఏపీపీఎస్సీ ఫలితాలను ప్రకటించిందని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు బుధవారం తీర్పునిచ్చింది. గ్రూప్-1 మెయిన్స్‌కు మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆదేశించింది. ఎంపిక ప్రక్రియను ఆరు వారాల్లోగా పూర్తి చేయాలని తెలిపింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను రద్దు చేసింది. మెయిన్స్ జవాబు పత్రాలను అనేక సార్లు మూల్యాంకనం చేయడం చట్ట విరుద్ధమని అభిప్రాయం వ్యక్తం చేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అభ్యర్థుల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

# రద్దు హర్షణీయం

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**విశాలాంధ్ర-విజయవాడ :** ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) 2018లో నోటిఫికేషన్ ఇచ్చిన గ్రూపు-1 మెయిన్ పరీక్షను ఏపీ హైకోర్టు రద్దు చేస్తూ తీర్పునివ్వటం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం

- మిగతా 2 లో

## మహిళలకు ఏటా

# రూ.లక్ష సాయం

- ప్రభుత్వోద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్
- ఆశా, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బడ్జెట్‌లో వాటా రెట్టింపు
- మహిళలకు హక్కులపై అవగాహనకు నోడల్ అధికారి
- ప్రతి జిల్లాలో మహిళలకు సావిత్రీబాయి ఫూలే హాస్టళ్లు
- ఐదు 'మహిళ న్యాయ' హామీలు ప్రకటించిన రాహుల్ గాంధీ

**ధులే (మహారాష్ట్ర):** రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే పేద మహిళలకు ఏటా లక్ష రూపాయలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్ సహా ఐదు 'మహిళా న్యాయ' హామీలను కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ బుధవారం ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని రద్దు చేసేందుకు రాజ్యాంగ సవరణ తీసుకువస్తామని ఏఐసీసీ కమ్యూనికేషన్ల వ్యవహారాల ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ హామీ ఇచ్చారు. 'భారత్ జోడో న్యాయ యాత్ర'లో భాగంగా మహారాష్ట్రలోని ధులే జిల్లాలో మహిళల ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించిన గాంధీ, ఐదు 'మహిళా న్యాయ' హామీలను ప్రకటించారు. పేద మహిళల బ్యాంకు ఖాతాల్లో ఏటా రూ.లక్ష జమ చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగాల్లో తమ పార్టీ మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుందని ఆయన తెలిపారు. ఆశా (అక్రెడిటెడ్ సోషల్ హెల్త్ యాక్టివిస్ట్) వర్కర్లు, అంగన్‌వాడీలు (ప్రభుత్వం అధ్వర్యంలోని మహిళా శిశు సంరక్షణ కేంద్రాలు), మధ్యాహ్న భోజన పథకాల్లో పనిచేస్తున్న మహిళలకు బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వ వాటాను రెట్టింపు చేస్తామని గాంధీ హామీ ఇచ్చారు. మహిళలకు వారి హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు వారి కేసుల పోరాటంలో సహాయం చేసేందుకు నోడల్ అధికారిని నియమిస్తామన్నారు. అలాగే, దేశంలోని ప్రతి జిల్లాలో మహిళల కోసం సావిత్రీబాయి ఫూలే హాస్టళ్లను ఏర్పాటు చేస్తామని రాహుల్ గాంధీ తన ఐదు హామీలను వివరించారు. ఈ సందర్భంగా తాను కన్యాకుమారి నుంచి శ్రీనగర్ వరకు (తన మునుపటి భారత్ జోడో యాత్రలో) 4 వేల కిలో మీటర్లు నడిచానని, లక్షలాది మందితో సంభాషించానని కాంగ్రెస్ నాయకుడు చెప్పారు. పారిశ్రామికవేత్తలకు రూ.16 లక్షల కోట్లు మాఫీ చేశారని, రైతులు, యువతకు రుణాలు మాఫీ చేయలేదని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై

- మిగతా 2 లో



మార్క్సిస్టు మహా మహోపాధ్యాయుడు, సిద్ధాంతకర్త, తత్వవేత్త కార్ల్‌మార్క్స్ 141వ వర్ధంతి నేడు

## ఏడు విడతల్లో లోక్‌సభ ఎన్నికలు?

**న్యూఢిల్లీ:** దేశంలోని ప్రధాన పార్టీలు ఇప్పటికే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించగా... రానున్న రెండ్రోజుల్లో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ నెల 15న నోటిఫికేషన్ వచ్చే అవకాశముందని తెలుస్తోంది. లోక్‌సభ, నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయనుండగా... మొత్తం ఏడు విడతల్లో లోక్‌సభ ఎన్నికలు జరగవచ్చని భావిస్తున్నారు. లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, సిక్కిం రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల సంఘం కసరత్తు చివరి దశకు చేరిన నేపథ్యంలో పోలింగ్ తేదీలపై రాజకీయపార్టీల్లో ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల ఏర్పాట్లపై ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో పర్యటించిన కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు.. బుధవారం జమ్మూకశ్మీర్ చేరుకున్నారు. ఎన్నికల ఏర్పాట్లను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు. ఈసారి దేశంలో 96.88 కోట్లకు పైగా ఓటర్లు ఉన్నారు. కొత్తగా 1.85 కోట్ల మంది ఓటు హక్కు నమోదు చేసుకున్నారు.

## నాగపట్టణం, తిరుప్పూర్ నుంచి సీపీఐ పోటీ

**చెన్నై:** రాబోయే ఎన్నికల్లో పోటీ చేసే స్థానాలపై తమిళనాట సీట్ల సర్దుబాటు కుదిరింది. నాగపట్టణం, తిరుప్పూర్ నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ), మధురై, దిండిగల్ స్థానాల నుంచి సీపీఎం పోటీ చేయనున్నాయి. 2019లోనూ ఇవే స్థానాల నుంచి సీపీఐ పోటీ చేసింది. తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌తో భేటీ తర్వాత ఈ మేరకు వివరాలను సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు ఆర్.ముతరాసన్, కె.బాలకృష్ణన్ తెలిపారు. బీజేపీ నిరంకుశ పాలన, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడటానికి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, లౌకికవాదాన్ని కాపాడుకోవడానికి ఇండియా కూటమి ఏర్పాటైందని ముతరాసన్ అన్నారు. డీఎంకే నేతృత్వ కూటమిలో చీలికలను కొందరు ఆకాంక్షించారు కానీ అందుకు భిన్నంగా మిత్రపక్షాల మధ్య సీట్ల సర్దుబాటు

- మిగతా 2 లో

## బంగినపల్లి, తోతాపురి

# కనుమరుగు!

మామిడికి పుట్టినిల్లుగా పేరుగాంచిన ఉమ్మడి పశ్చిమ కృష్ణా జిల్లా (ఎన్టీఆర్ జిల్లా) పరిధిలోని తోటలు కనుమరుగయ్యేలా ఉన్నాయి. పూత, పిందెలు లేక మోడువారి కనిపిస్తున్నాయి. నోరూరించే బంగినపల్లి, తోతాపురి కాయలు కానరాకపోవడంతో ప్రజలు జిహ్వ చంపుకుని వెనుతిరుగుతున్నారు. ఎకరాకు ఆరు నుంచి ఏడు టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా అర టన్ను కూడా రాకపోవడంతో రైతన్నలు దిగాలు చెందుతున్నారు. నల్లిపురుగు, తేనెమంచు తెగుళ్లు రైతుల ఆశలను ఆవిరిచేశాయి. మామిడి పండ్లను ఆరగించేయవచ్చని ఎన్నో ఆశలుపెట్టుకున్న దేశ, విదేశీయులు సైతం నిరాశ చెందుతున్నారు. పరిస్థితులు ఇలానే కొనసాగితే మామిడి పూర్తిగా అంతరించే ప్రమాదం ఉందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

- మామిడి తోటల్ని పీడిస్తున్న తెగుళ్లు
- దిగుబడిరాక రైతన్నల దిగాలు

2లో

# అడుగడుగునా షరతులు...ఆంక్షలు

- నేడు దిల్లీలో కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్
- మధ్యాహ్నం 2.30గంటల వరకే రామ్‌లీలాలో ఉండాలి
- ఐదు వేల మందికి మించకూడదు... ట్రాక్టర్లు తేరాదని ఆంక్షలు
- మార్చ్ నిర్వహించబోమని హామీ పత్రం ఇవ్వాలని షరతు
- జయప్రదానికి ఎస్‌కేఎం పిలుపు

**న్యూఢిల్లీ:** మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని రైతు సంఘాలు సంకల్పించాయి. ఇదే క్రమంలో గురువారం (14వతేదీ) దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్ నిర్వహించనున్నాయి. ఈ కార్యక్రమానికి దిల్లీ పోలీసులు అడుగడుగునా ఆంక్షలు, షరతులు విధించారు. రామ్ లీలా మైదానంలో మధ్యాహ్నం 2.30గంటల తర్వాత ఉండకూడదని, ఐదు వేల మందికి మించి హాజరు కారాదని, ట్రాక్టర్లను అనుమతించబోమని, దిల్లీలో మార్చ్ నిర్వహించమని హామీ పత్రం ఇవ్వాలని షరతలు విధించారు. ఆదేశాలకు కట్టుబడాలని లేని పక్షంలో కఠిన చర్యలు తప్పబోవని హెచ్చరించారు. అన్నింటికీ రైతులు అంగీకరించడంతో మహా పంచాయత్‌కు ఎన్‌ఓసీని దిల్లీ పోలీసులు జారీచేశారు. ఇదే విషయమై డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సెంట్రల్) ఎం.హర్ష వర్ధన్ బుధవారం 'పీటీఐ'తో మాటాడుతూ మహాపంచాయత్‌కు అనుమతులు జారీ అయ్యాయని చెప్పారు. ఐదు వేల మందికి మించి రాకూడదని, ట్రాక్టర్లు, ఆయుధాలు తేకూడదని ఆదేశించగా రైతులు అంగీకరించారని తెలిపారు. దిల్లీలో మార్చ్ నిర్వహించబోమని రైతుల నుంచి హామీ పత్రాన్ని తీసుకున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకే మహాపంచాయత్‌కు అనుమతి ఇచ్చామని, ఆ తర్వాత రామ్ లీలా మైదానాన్ని ఖాళీ చేయాలని రైతులకు స్పష్టం చేసినట్లు మరొక పోలీసు అధికారి వెల్లడించారు. ఆదేశాలను ఉల్లంఘించినా, దిల్లీలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా

- మిగతా 2 లో

## ఇదీ లోకం!

# రాష్ట్ర హితం కోసమే పొత్తు

- ఎన్‌డీఏతో టీడీపీ భాగస్వామ్యం ఈనాటి కాదు
- సీట్లు రాని వారంతా పొత్తు ధర్మం పాటించాలి
- టీడీపీ అధినేత చంద్రబాబు



**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :** రాష్ట్ర హితం కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకున్నట్లు, ఈ కూటమి అధికారంలోకి రాగానే మహాశక్తి కింద ఐదు కార్యక్రమాలను తీసుకొస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ప్రజలు గెలవాలని, రాష్ట్రం గెలవాలని, రాబోయే ఎన్నికల్లో జరగబోయేదీ ఇదేనని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో బుధవారం విద్యార్థినులతో కలిసి కలలకు రెక్కలు వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్లను చంద్రబాబు అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కొందరు విద్యార్థినులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ప్రధాని మోదీ చెబుతున్న వికసిత్ భారత్ 2047 జరిగి తీరుతుందన్నారు. రాష్ట్రంలో జగన్ విధ్వంసం సృష్టించారని, దీంతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి పోయిందన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సాయం అవసరమని, రాష్ట్ర పునర్నిర్మాణం కోసమే మూడు పార్టీల పొత్తు అని పునరుద్ఘాటించారు. విభజన హామీలు సాధించడంలో జగన్ విఫలమయ్యారని విమర్శించారు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఉన్న ప్రతిసారీ టీడీపీకి మేలు జరిగిందన్నారు. భారత్‌లో ఆర్థిక సంస్కరణల వల్ల పెట్టుబడిదారులు పెరిగారని, దేశంలో యువత అధికంగా ఉండటం వల్ల కలిసొచ్చే అంశమని వివరించారు. గాడితప్పిన జగన్ పరిపాలనతో రాష్ట్రంలో ఏ వ్యవస్థ సరిగ్గా లేదని

- మిగతా 2 లో

# ఎన్నికలకు 'రెఢీ'

- 16న వైసీపీ తుది జాబితా
- 18 నుంచి సీఎం జగన్ ప్రచారం
- నేడు టీడీపీ రెండో జాబితా
- 17న పేటలో ఎన్నికల శంఖారావం

**విశాలాంధ్రబ్యూరో-అమరావతి:** సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు సమయం ఆసన్నం కావడంతో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు దూకుడు పెంచాయి. అధికార వైసీపీతోపాటు ఎన్నికల పొత్తు కుదుర్చుకున్న టీడీపీ-జనసేన-బీజేపీలు అభ్యర్థుల జాబితా విడుదలకు సిద్ధమయ్యాయి. వైసీపీ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థుల తుది జాబితా ఒకట్రెండు మార్పులతో ఖరారు కానుంది. ఈనెల 16వ తేదీన ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ వద్ద వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారికంగా 175 ఎమ్మెల్యే, 25 ఎంపీ అభ్యర్థుల్ని ఏక కాలంలో ప్రకటించనున్నారు. తాడేపల్లి నుంచి నేరుగా సీఎం ఇడుపులపాయకు చేరుకుని, అక్కడ తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తారు. అనంతరం తుది జాబితాను వెల్లడిస్తారు. 2019 ఎన్నికల జాబితానూ అలాగే ప్రకటించారు. అప్పట్లో హైదరాబాద్‌లోని లోటస్ పాండ్ నుంచి జగన్ ఇడుపులపాయకు వచ్చి అభ్యర్థుల జాబితాను వెల్లడించారు. ఇప్పుడూ అదే పద్ధతిని జగన్ అనుసరించనున్నారు. ఈ జాబితా ప్రకటన అనతరం ఎన్నికల ప్రచారానికి సీఎం శ్రీకారం చుడతారు. తొలుత ఈనెల 16వ తేదీ నుంచి జగన్ ఎన్నికల ప్రచారానికి సన్నద్ధమవ్వగా... అంతకంటే ముందు తుది జాబితాను ప్రకటించి, నియోజకవర్గాల్లోకి వెళ్లాలని నిర్ణయించారు. దీంతో 18వ తేదీన ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి ఆయన ప్రచారాన్ని

- మిగతా 2 లో

## ఈసీకి 22,217 బాండ్ల

# వివరాలిచ్చాం

### సుప్రీంకోర్టులో ఎస్‌బీఐ అఫిడవిట్

**న్యూఢిల్లీ:** రాజకీయ పార్టీలు 2019, ఏప్రిల్ 1 నుంచి 2024, ఫిబ్రవరి 15 వరకు కొనుగోలు చేసిన 22,217 ఎన్నికల బాండ్ల వివరాలను భారత ఎన్నికల సంఘానికి అందజేసినట్లు ఎస్‌బీఐ బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. 22,217లో నుంచి 22,030 బాండ్లను రాజకీయ పార్టీలు రిడీమ్ చేసుకున్నట్లు పేర్కొంది. మిగిలిన 187 బాండ్లను కూడా రిడీమ్ చేసి, ఆ మొత్తాన్ని ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధికి

- మిగతా 2 లో

# అణు యుద్ధానికి రష్యా సిద్ధం

- ఉక్రెయిన్‌పై అణ్వాస్త్రాలు వాడాలనుకోలేదు
- ఆ దేశంపై వాస్తవాధారిత చర్చలకు సానుకూలమే
- అమెరికా కవ్విస్తే ఉపేక్షించబోం : పుతిన్



**మాస్కో:** అణు యుద్ధానికి రష్యా సిద్ధంగా ఉన్నట్లు ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వెల్లడించారు. సైనికపరంగానే కాకుండా సాంకేతికపరంగానూ అణు యుద్ధానికి సిద్ధమని, అయితే అందుకు కొన్ని విధివిధానాలు ఉన్నాయని చెప్పారు. అణు యుద్ధం విషయంలో ఎలాంటి తొందరపాటు లేదని చెప్పారు. పాశ్చాత్య దేశాలు రష్యాను ఓడించలేవని, ఇందుకోసం విఫల ప్రయత్నాలు చేయాలని దుయ్యబట్టారు. ఉక్రెయిన్‌కు మద్దతివ్వడాన్ని అమెరికా ఆపకపోతే పరిస్థితి మరింత జటిలం కావచ్చని హెచ్చరించారు. అదే సమయంలో ఉక్రెయిన్‌పై చర్చలకు సానుకూలమని తెలిపారు. మీ దళాలను ఉక్రెయిన్‌కు పంపవద్దని అమెరికాకు తేల్చిచెప్పారు. బలగాలను పంపితే ఘర్షణను కాకలుదువ్వుతున్నట్లు పరిగణిస్తామని స్పష్టంచేశారు. ఈనెల 15-17 తేదీల్లో రష్యాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈసారి కూడా అధ్యక్ష పీఠాన్ని పుతిన్ అధీష్టిస్తారని, ఆరవసారి బాధ్యతలు చేపడతారని తెలుస్తోంది. ఇదే క్రమంలో పుతిన్ బుధవారం రొస్సియా-1 టీవీ, వార్తాసంస్థ ఆర్ఐఏకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అణు యుద్ధానికి రష్యా సర్వసన్నద్ధంగా ఉన్నదన్నారు. మిలటరీ నుంచి టెక్నికల్ పాయింట్ వరకు అంతా సిద్ధమన్నారు. ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలు ప్రయోగించాల్సిన అవసరం రాలేదన్నారు. తమ దళాలను రష్యా భూభాగానికి లేక ఉక్రెయిన్‌కు పంపితే దానిని కవ్వింపు చర్యగా రష్యా పరిగణిస్తుందని అమెరికా గ్రహించిందని చెప్పారు. రష్యా-అమెరికా సంబంధాలు... వ్యూహాత్మక ప్రతిఘటన రంగాల్లో నిపుణులు అమెరికాకు సరిపడ ఉన్నారన్నారు. అణు యుద్ధం కోసం తొందరపడటం లేదన్నారు. ఆయుధాలు ఉండేది ప్రయోగించడం కోసమే అని పుతిన్ చమత్కరించారు. ఉక్రెయిన్ విషయంలో వాస్తవాధారిత చర్చలకు సిద్ధమని ఆయన తెలిపారు. తాను ఎవరినీ నమ్మనని, రాజీ జరగాలంటే రాతపూర్వక హామీలు అవసరమన్నారు. 'నేను ఎవరినీ నమ్మను కానీ మాకు హామీలు కావాలి, ఆ హామీలు మమ్మల్ని సంతృప్తి పరిచే విధంగా ఉండాలి' అని పుతిన్ ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

# రీమ్యాచ్‌కు బైడెన్, ట్రంప్ సై

- ప్రైమరీ ఎన్నికల్లో వరుస విజయాలతో ముందుకు
- జార్జియాలోనూ గెలుపు

**వాషింగ్టన్:** అమెరికాలో మరోసారి జోబైడెన్, డొనాల్డ్ ట్రంప్ మధ్య గట్టి పోటీ నెలకొన్నది. 2020 ఎన్నికల్లో అధ్యక్ష పదవి కోసం వీరిద్దరు పోటీ పడ్డారు. 1956 తర్వాత అమెరికాలో రీమ్యాచ్ పరిస్థితి నెలకొన్నది. అప్పట్లో రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు డ్విట్ డి.ఐసెన్‌హోవర్ తన ప్రత్యర్థి, డెమొక్రటిక్ అభ్యర్థి అడ్లాయ్ స్టీవెన్‌సెన్‌పై విజయం సాధించారు. అమెరికాలో నాలుగేళ్ల కిందట దృశ్యం పునరావృతం కాబోతోంది. అధ్యక్ష ఎన్నికల్లోనూ రీమ్యాచ్ జరగబోతోంది. రిపబ్లికన్ అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్, డెమొక్రాట్ అభ్యర్థిగా జో బైడెన్ నేరుగా తలపడనున్నారు. ప్రైమరీ ఎన్నికల్లో వరుస విజయాలతో వీరిద్దరు దూకుడు మీదున్నారు. జార్జియా, మిసిసిప్పీ, వాషింగ్టన్‌తో సత్తా చాటారు. అధ్యక్ష పీఠాన్ని అధీష్టించేందుకు సరిపడ ప్రాతినిధ్యం బైడెన్‌కు ఉన్నది. తన నామినేషన్‌ను బైడెన్ సంబరం చేసుకున్నారు. ట్రంప్‌ను ప్రజాస్వామ్యానికి ముప్పుగా పేర్కొన్నారు. మరోవైపు తన విజయాలపై ట్రంప్ ఆనందం వ్యక్తంచేస్తూ సామాజిక మాధ్యమంలో వీడియో పెట్టారు. దేశ చరిత్రలోనే చెత్త అధ్యక్షుడని బైడెన్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. ఎనిమిది నెలల్లో మనం వేడుక చేసుకోబోతున్నామని దీమాగా చెప్పారు. మంగళవారం రోజున జరిగే ప్రైమరీ ఎన్నికల్లో ఇద్దరు తమ పార్టీ తరపున వరుస విజయాలు నమోదు చేస్తున్నారు. హవాయి, రిపబ్లికన్ కౌకస్‌లో ట్రంప్ గెలిచారు. గెలుపు దీమాతో ఉన్నప్పటికీ ఈ ఇద్దరి ప్రయాణం నల్లేరుపై నడకగా ఉండబోదు. బైడెన్‌కు వయస్సు మీదపడుతుంది. ఆయన ఇప్పటికే వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. మరోవైపు గాజాలో ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపేందుకు ఏమీ చేయలేకపోవడంతో ఆయనపై ప్రజల్లో ఆగ్రహం ఉంది. దీంతో వాషింగ్టన్‌లోని కార్యకర్తలు, మత నాయకులు 'అన్‌కమిటెడ్' ఓటు వేయాలని పిలుపునిచ్చారు. తమ అన్‌కమిటెడ్ ఓటు డెమొక్రటిక్ పార్టీకి మేల్కొలుపుగా పరిణమిస్తుందని 26ఏళ్ల బెల్లా రివేరా (సీటెల్) అభిప్రాయపడ్డారు. 'మీకు మా ఓట్లు కావాలంటే... ఈ ఎన్నికల్లో గెలవాలంటే.. పలస్తీనా విమోచనానికి మద్దతు ఇవ్వాలి, ఇజ్రాయిల్‌కు నిధులు నిలిపివేయాలి' అని డెమొక్రాట్లను డిమాండ్ చేశారు. మరోవైపు ట్రంప్ నేరచరితుడిగా ఉన్నారు. వరుస కేసుల్లో దోషిగా తేలారు. ట్రంప్ కాకుండా వేరొకరు రిపబ్లిక్ పార్టీకి ప్రాతినిధ్యం వహించివుంటే వారి వైపు మొగ్గు చూపేవారమని జార్జియాకు చెందిన డొన్నా గ్రాహమ్ అభిప్రాయపడ్డారు. ఆయనకు తొలి ప్రాధాన్యత ఇవ్వలేదు కానీ తమకు ప్రత్యామ్నాయం లేదన్నారు. నాలుగేళ్ల కిందట జరిగినదే మళ్లీ జరగబోతుండటం బాధాకరమని ట్రంప్, బైడెన్ మధ్య పోటీని ఉద్దేశించి అన్నారు.

# బల పరీక్షలో నెగ్గిన ప్రచండ

## 15 నెలల్లో ఇది మూడోసారి

**ఖాట్మండు:** నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ 'ప్రచండ' బుధవారం పార్లమెంటులో జరిగిన బలపరీక్షలో నెగ్గారు. ప్రతినిధుల సభలో మొత్తం 275 మంది సభ్యులు ఉంటే ప్రచండకు అనుకూలంగా 157 ఓట్లు వచ్చాయి. కేవలం 15నెలల్లో మూడు సార్లు బల పరీక్షను ప్రచండ ఎదుర్కొన్నారు. నేపాలీ కాంగ్రెస్‌తో తెగతెంపులు చేసుకొని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్-లెనినిస్ట్)తో జట్టు కట్టి కొత్త సంకీర్ణ ప్రభుత్వాన్ని ప్రచండ ఏర్పాటు చేశారు. పాలక సంకీర్ణంలోని పార్టీ తమ మద్దతు ఉపసంహరించుకుంటే విశ్వాస ఓటు జరుగుతుంది. రాజకీయ సుస్థిరత కోసం నేపాల్ శ్రమిస్తున్న సమయంలో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్ట్ సెంటర్)కు చెందిన మాజీ గెరిల్లా నాయకుడు ప్రచండ (69) ప్రధానిగా పగ్గాలు చేపట్టారు.

# జపాన్ తొలి ప్రైవేటు రాకెట్ ప్రయోగం విఫలం

## ప్రయోగించిన వెంటనే పేలినపోయిన 'కైరోస్'

**టోక్యో:** జపాన్ తొలి ప్రైవేటు రాకెట్ 'కైరోస్' ప్రయోగం విఫలమైంది. ప్రయోగించిన కొన్ని సెకన్లలోనే అది పేలిపోయింది. పశ్చిమ జపాన్‌లోని వకయమ ప్రిఫిక్చర్ వద్ద ప్రయోగ వేదిక నుంచి కైరోస్‌ను బుధవారం మధ్యాహ్నం నింగిలోకి దూసుకెళ్లింది. కానీ కొద్దిసేపటికే పేలిపోయింది. రాకెట్ శకలాలు చుట్టుపక్కల ప్రాంతాల్లో చల్లా చెదురుగా పడ్డాయి. దీని దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. 'స్పేస్ వన్' సంస్థ ఈ రాకెట్‌ను తయారు చేసింది. ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యకు చేర్చి రికార్డు సృష్టించాలని భావించింది. కానీ అది సాధ్యం కాలేదు. 'కైరోస్' రాకెట్... 18 మీటర్ల (60 అడుగుల) ఘన ఇంధన రాకెట్. ప్రయోగించిన కొన్ని సెకన్లకే రాకెట్‌లో మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతాన్ని దట్టమైన పొగ కమ్మేసింది. వాటర్ స్ప్రింక్లర్ల పిచికారీతో శిథిలాలు పర్వాతాలపై పడ్డాయి. ఈ ప్రమాదంపై స్పేస్ వన్ ఒక ప్రకటన చేసింది. కైరోస్ రాకెట్ ప్రయోగానికి సంబంధించిన ప్రక్రియ

మొత్తం సజావుగా సాగిందని, ప్రయోగాన్ని మధ్యలో నిలిపివేసేందుకు చర్యలు కూడా తీసుకున్నామని తెలిపింది. కానీ ఇలా జరుగుతుందని ఊహించలేదని పేర్కొంది. కెనాన్ ఎలక్ట్రానిక్స్, ఐహెచ్ఐ ఏరోస్పేస్, నిర్మాణ సంస్థ షిమిజు, ప్రభుత్వ యాజమాన్యంలోని డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ జపాన్‌తో సహా ప్రధాన జపనీస్ టెక్ వ్యాపారాల బృందం 2018లో స్పేస్ వన్‌ను స్థాపించిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే, గతేడాది ఎప్సిలాన్ ఎస్ రాకెట్ కూడా ఇదే విధంగా ప్రయోగించిన 50 సెకన్లలో పేలిపోయింది. 2023 మార్చిలో టోక్యో హెచ్ 3 రాకెట్ ప్రయోగానికి రెండవ ప్రయత్నం కూడా విఫలమైంది.

## ఈసీకి 22,217 బాండ్ల వివరాలిచ్చాం

(మొదటిపేజీ తరువాయి)

నిబంధనల ప్రకారం అందజేసినట్లు వెల్లడించింది. ఈ మేరకు అఫిడవిట్‌ను బుధవారం దాఖలు చేసింది. బాండ్ల సమాచారాన్ని పెన్‌డ్రైవ్‌లో, రెండు పీడీఎఫ్ ఫైళ్ల రూపంలో పాస్‌వర్డ్‌తో సహా ఇచ్చినట్లు ఎస్‌బీఐ తెలిపింది. '2019, ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 11 వరకు 3,346 బండ్లను రాజకీయ పార్టీలు కొనుగోలు చేశాయి. 1,609 బాండ్లను రిడీమ్ చేసుకున్నాయి. 2019, ఏప్రిల్ 12 నుంచి 2024, ఫిబ్రవరి 15 వరకు 18,871 బాండ్లను కొనుగోలు చేయగా 20,421 బాండ్లు రిడీమైనట్లు అఫిడవిట్‌లో పేర్కొంది. 2019, ఏప్రిల్ 12 నుంచి కొనుగోలు చేసిన బాండ్ల వివరాలను సుప్రీంకోర్టు కోరినప్పటికీ ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఎన్నికల బాండ్ల అమ్మకాలు, రిడీమ్ ప్రక్రియ మొదలైనట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వివరించింది. ఈసీఐకి సంబంధిత సమాచారాన్ని అందజేసినట్లు కోర్టుకు తెలిపింది. కొనుగోలుదారుల పేర్లు, విరాళాలు పొందిన పార్టీలు, బాండ్ల డినామినేషన్ తదితర వివరాలను ఎన్నికల సంఘానికి ఇచ్చినట్లు అఫిడవిట్‌లో తెలిపింది. ఇదిలావుంటే సోమవారం జరిగిన విచారణలో ఎస్‌బీఐ కోరినమేరకు గడువు ఇచ్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. మంగళవారం లోపు వివరాలను ఈసీకి అందజేయాలని ఆదేశాలిచ్చింది. ఆపై శుక్రవారం అనగా 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా డేటాను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని ఎన్నికల సంఘానికి ఉత్తర్వులను సర్వోన్నత న్యాయస్థానం జారీచేసింది.

**గడువులోగా వెల్లడిస్తాం: సీఈసీ**

ఎన్నికల బాండ్ల వివరాలను సుప్రీంకోర్టు ఇచ్చిన గడువులోగా వెల్లడిస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ తెలిపారు. ఫిబ్రవరి 15, మార్చి 11 నాటి విచారణలలో ఎస్‌బీఐకి సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకనుగుణంగా, మార్చి 12న ఎన్నికల బాండ్ల డేటాను ఎన్నికల సంఘానికి ఎస్‌బీఐ అందజేసినట్లు ఈసీఐ 'ఎక్స్' ద్వారా ప్రకటించడం విదితమే.

## రాష్ట్ర హితం కోసమే పొత్తు

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. రైతులు, యువత, కార్మికులు నిరుద్యోగులు తదితర అన్ని వర్గాలు నష్టానికి గురయ్యారని చెప్పారు. విద్యా రాజధానిగా ఎదగాల్సిన రాష్ట్రం సర్వనాశనమైందని, ప్రజలు గెలవాలంటే వైసీపీని ఓడించాలని పిలుపునిచ్చారు. పోలవరం పూర్తయి, అమరావతి అభివృద్ధి చెంది ఉంటే, రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చేవని, మన ప్రగతి ముందుకు పోయేదని చెప్పారు. ఇన్ని తప్పులు చేసిన జగన్ తాను ఏకాకినంటున్నాడని చెప్పారు. టీడీపీ ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉండటం ఈనాటిది కాదంటూ ఆయన స్పష్టత ఇచ్చారు. తమ పొత్తులోని మూడు పార్టీల్లో ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ కాదని స్పష్టం చేశారు. సీట్లు రాని ఆశావాహులు నిరాశ చెందకుండా పొత్తు ధర్మాన్ని పాటించి సహకరించాలని కోరారు. కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు, కళాశాల సీట్లలో రిజర్వేషన్లు తీసుకొచ్చామని గుర్తుచేశారు. ఆడ పిల్లలు రిజర్వేషన్లతో ప్రస్తుతం మగవారితో సమానంగా పని చేస్తున్నారని వివరించారు. తాము తీసుకొచ్చిన పథకాలతో ఎంతో మంది విదేశాలకు వెళ్లి చదువును అభ్యసించారని చెప్పారు. కలలకు రెక్కలు కార్యక్రమం ద్వారా విద్యార్థినుల ఉన్నత చదువుల కోసం బ్యాంకు రుణాలు తీసుకునేలా సహకరిస్తామని, వాటికి వడ్డీని ప్రభుత్వమే కడుతుందన్నారు. తల్లికి వందనం పేరుతో ఏడాదికి రూ.15 వేలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు తెచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో 22 కొత్త పథకాలు తీసుకొచ్చినట్లు చెప్పారు. ఒకప్పుడు ఐటీ అని తాను చెబుతుంటే అందరూ నవ్వేవారని. ఆ రంగంలో నేడు ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారు ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు గెలవాలంటే తప్పనిసరిగా వైసీపీని ఓడించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

## 17న 'నామిని'కి 'మాండలిక బ్రహ్మ' అవార్డు ప్రదానం

**విశాలాంధ్ర-విజయవాడ:** ప్రముఖ సాహితీవేత్త నామిని సుబ్రహ్మణ్యం నాయుడుకు రాజన్న ఫౌండేషన్ 'మాండలిక బ్రహ్మ' అవార్డును ప్రదానం చేయనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ అమర్‌రాజా గ్రూపు వ్యవస్థాపకుడు గల్లా రామచంద్రరావు, డైరెక్టర్లు గల్లా అరుణకుమార్, డాక్టర్ రామాదేవి గౌరినేని బుధవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న తిరుపతి కరకంబాడిలోని అమర్‌జారా ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు అవార్డు ప్రదాన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. శ్వేత డైరెక్టర్ భూమన్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ప్రజా గాయకుడు, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. అభినవ ప్రచురణలు సంపాదకులు సాకం నాగరాజు, ప్రముఖ జర్నలిస్టు తాడి ప్రకాశ్, ప్రజా గాయకుడు పుట్టా పెంచలదాసు పాల్గొంటారని వివరించారు.



# బంగినపల్లి, తోతాపురి కనుమరుగు!

**విశాలాంధ్ర-లింగపాలెం:** మామిడికి ప్రసిద్ధిగాంచిన ఎన్టీఆర్ జిల్లా చింతలపూడి నియోజకవర్గం పరిధిలో మామిడి చెట్టుకు కాయలు కనిపించని పరిస్థితి నెలకొంది. సీజన్ వచ్చిందంటే దేశ, విదేశాలవారు సైతం ఈప్రాంతంలోని కాయలకు ఎగబడుతుంటారు. విమానాల్లో విదేశాలకు ఎగుమతి చేయడం రివాజు. కానీ ఈ ఏడాది ఇటువంటి పరిస్థితులు లేవు. ఈ ప్రాంత ప్రజలే కాయలు కోసం మరో ప్రాంతానికి వెళ్తున్నారు. మామిడికి పుట్టినిల్లుగా పేరుగాంచిన ఈ ప్రాంతంలో ఇప్పుడు మామిడి తోటలు కనుమరుగయ్యేలా ఉంది. మామిడి తోటలను నమ్ముకున్న రైతులు దిగుబడులు లేకపోవటంతో కుదేలయ్యారు. చింతలపూడి, నూజివీడు నియోజకవర్గాల పరిధిలో 17 వేల మంది రైతులు దాదాపు 40 వేల ఎకరాల్లో మామిడి తోటలను పెంచుతున్నారు. ఇక్కడ కాసే బంగినపల్లి, తోతాపురి, రసం కాయలకు మంచి డిమాండ్ ఉంది. దిగుబడులు లేకపోవడంతో ధర అమాంతంగా పెరిగిపోయింది. దీంతో దిగాలుచెందుతున్న మామిడి రైతులు... పుండు మీద కారం చల్లినట్టు ఉందని అంటున్నారు. ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టిన దిగుబడి ఆశించిన రైతులకు ప్రతికూల పరిస్థితి ఎదురైంది. తోతాపురి ఎకరాకు ఆరు నుంచి ఏడు టన్నులు, బంగినపల్లి నాలుగు టన్నులు

దిగుబడులు రావాల్సి ఉండగా అరటన్ను కూడా రావడం లేదు. కొన్ని చెట్లకు కాపేలేదు. దీంతో మామిడి రైతులు కుమిలిపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మామిడికి పుట్టినిల్లుగా పేరుపొందిన ఈ ప్రాంతంలో మామిడి కనుమరుగవుతుందని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**తేనెమంచు, నల్లిపురుగుతో దెబ్బతిన్న తోటలు**

ఈ ఏడాది తేనెమంచు, నల్లిపురుగు మామిడి తోటలపై ప్రభావం చూపడంతో దిగుబడులు రాలేదు. వీటి బారి నుంచి తోటలను రక్షించుకోవటానికి రైతులు ఎంతగా కృషి చేసినా ఫలితం లేకుండా పోయింది. గతంలో నల్లిపురుగు మిర్చితోటలకే పరిమితం అయ్యేవి. ఈ ఏడాది మామిడి తోటలను ఆశించడం, దీనికి తేనెమంచు తోడుకావడంతో తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో రైతులు కుదేలయ్యారు. దిగుబడిపై ఆశలు పెట్టుకున్న మామిడి రైతుల ఆశలు ఆవిరయ్యాయి.

**పునరుద్ధరణ పథకం ఎక్కడ?**

మామిడి రైతులను ఆదుకోవటానికి పునరుద్ధరణ పథకం ఎక్కడ అమలవుతుందనే విమర్శలు నెలకొన్నాయి. ఉద్యానశాఖ నుంచి మామిడి రైతులకు సబ్సిడీపై మందులు పంపిణీ చేయాల్సి ఉంది. ప్రకృతి విపత్తు ఆధారిత బీమా పథకం అమలు చేయాలి. మామిడి తోటలను తెగుళ్ల నుంచి రక్షించటానికి శాస్త్రవేత్తల ద్వారా సలహాలు... అవగాహన కల్పించాలి. ఇష్టానుసారంగా పురుగు మందులు చల్లకుండా రైతులను చైతన్యపరచాల్సి ఉంది. ఇవేవీ జరగటంలేదని రైతులు విమర్శిస్తున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే మామిడి పూర్తిగా అంతరించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**దేశ, విదేశీయుల నిరాశ**

ఈ ప్రాంతంలో మామిడికాయల దిగుబడి లేకపోవటంతో దేశ, విదేశాల్లోని వారు తీవ్ర నిరాశను వ్యక్తం చేస్తున్నారు. కాయల కోసం వచ్చిన వారంతా దిగాలుగా వెనుతిరిగి వెళు్తన్నారు. నాణ్యత, రుచిగా ఉండటం వల్ల మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ కాయలతో పచ్చళ్లు పడితే ఏడాది వరకు పాడవవని ప్రజలు అంటున్నారు.

## అడుగడుగునా షరతులు... ఆంక్షలు

(మొదటిపేజీ తరువాయి)

రైతులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తమకు ఇచ్చిన హామీలకు రైతులు కట్టుబడతారని డీసీపీ ఆకాంక్షించారు.

ఇదిలావుంటే మహాపంచాయత్‌ను జయప్రదం చేయాలంటూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. 'ఈనెల14న రామ్ లీలా మైదానంలో మహాపంచాయత్ నిర్వహణకు ఢిల్లీ పోలీసుల నుంచి ఎన్‌ఓసీ లభించింది. పార్కింగ్‌తో పాటు మంచినీళ్లు, మరుగుదొడ్లు, అంబులెన్స్ తదితర ఏర్పాట్లు ఢిల్లీ మున్సిపల్ యంత్రాంగం సహకారంతో జరిగాయి' అని ఎస్‌కేఎం పేర్కొంది. కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్‌ను జయప్రదం చేయాలని రైతులకు, కార్మికులు, విద్యార్థి-మహిళా-పౌరసంఘాలకు పిలుపునిచ్చింది. ఈ మహాపంచాయత్‌లో 'సంకల్ప పత్రాన్ని' ఆమోదించనున్నట్లు వెల్లడించింది. కార్పొరేట్ అనుకూల, మత-నిరంకుశ విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేయడమే కాకుండా వ్యవసాయాన్ని, ఆహార భద్రత, జీవనోపాధి పరిరక్షణకు, కార్పొరేట్ లూటీ నుంచి ప్రజలను కాపాడేందుకు తమ ఆందోళనను తీవ్రతరం చేయబోతున్నట్లు తెలిపింది.

సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఉద్యమ భవిష్యత్ కార్యాచరణను మహాపంచాయత్ నిర్ణయిస్తుందని ఎస్‌కేఎం వెల్లడించింది. చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి రైతులు రైళ్లు, బస్సులు, నాలుగు చక్రాల వాహనాల్లో మహాపంచాయత్‌కు వస్తారని పేర్కొంది. తమ సంఘాల జెండాలు, స్టికర్లను వాహనాలకు పెట్టడం ద్వారా ప్రయాణంలో ఇబ్బందులు రాబోవని, రైతులను దించేసిన తర్వాత ఆయా వాహనాలను వాటి నిర్దేశిత స్థలాల్లో నిలపాలని ఎస్‌కేఎం సూచించిది. మహాపంచాయత్ ప్రశాంతంగా, అత్యున్నత క్రమశిక్షణతో జరుగుతుందని తెలిపింది. మహాపంచాయత్‌లో పాల్గొనాలని కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, యువత, మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు పిలుపునిచ్చింది. కేంద్ర కార్మిక సంఘాలు, ఇతర సమాఖ్యలు పాల్గోనున్నట్లు తెలిపింది. బీకేయూ చౌధుని సంఘాన్ని కూడా ఆహ్వానించింది. 2020-21లో ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల చరిత్రాత్మక పోరులో విజయం సాధించడాన్ని గుర్తుచేసింది. 13 నెలల పోరాటంలో 736 మంది రైతులు అమరులయ్యారని ఎస్‌కేఎం ప్రకటన తెలిపింది. ఇదిలావుంటే నెలరోజులుగా పంజాబ్-హర్యానా సరిహద్దుల్లో వందలాది మంది రైతులు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. ఢిల్లీ సరిహద్దులైన సింఘు, టిక్రీ, ఘాజీపూర్ వద్ద భారీగా పోలీసులు, పారామిలటరీ బలగాలను మోహరించి రైతులు రాజధాని నగరంలోకి రాకుండా పహారా కాస్తున్న విషయం తెలిసిందే.

**ట్రాఫిక్ ఆంక్షలు**

రామ్‌లీలా మైదానం వైపుకు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్‌ను మళ్లించినట్లు ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు ఒక ప్రకటన చేశారు. రైతుల మహాపంచాయత్ ప్రభావం ఉండే మార్గాలను పేర్కొన్నారు. జవహర్ లాల్ నెహ్రూ మార్గ్, బారాఖంబా రోడ్డు, బహదూర్‌షా జాఫర్ మార్గ్, టోల్‌స్టాయ్ మార్గ్, అసఫ్ అలీ రోడ్డు, జైసింగ్ రోడ్డు, స్వామి వివేకానంద మార్గ్, సంసద్ మార్గ్, నేతాజీ సుభాశ్ మార్గ్, బాబా ఖరగ్ సింగ్ మార్గ్, మింటో రోడ్డు, అశోకా రోడ్డు, మహారాజ్ రంజిత్ సింగ్ ఫ్లైఓవర్, కనౌట్ సర్కస్, భవభూతి మార్గ్, డీడీయూ మార్గ్, చమన్ లాల్ మార్గ్‌లో రాకపోకలకు అంతరాయం కలగవచ్చని ప్రకటన తెలిపింది. అలాగే ఢిల్లీ గేట్, మీర్ దర్ద్ చౌక్, అజ్మీరీ గేట్ చౌక్, గురు నానక్ చౌక్, కమలా మార్కెట్, పహార్‌గంజ్ చౌక్, ఝుండేవలన్ సర్కిల్, మహారాజా రంజిత్ సింగ్ ఫ్లైఓవర్...బారాఖంబా రోడ్డు నుంచి గురు నానక్ చౌక్, జన్‌పత్ రోడ్డు, కేజీ మార్గ్ క్రాసింగ్ వైపునకు ట్రాఫిక్‌ను ఉదయం 6 గంటల నుంచి మళ్లించనున్నట్లు వెల్లడించింది. ఐఎస్‌బీటీ, రైల్వేస్టేషన్ లేదా ఎయిర్‌పోర్టుకు వెళ్లాల్సిన వారు ముందుగానే బయల్దేరితే తప్ప సమయానికి గమ్యస్థానాలను చేరుకోలేరని సూచించింది.

## రద్దు హర్షణీయం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. గ్రూపు-1 మెయిన్స్ పరీక్షను 2020 డిసెంబరులో నిర్వహించి 2021 ఏప్రిల్‌లో ఫలితాలు విడుదల చేసిందని తెలిపారు. అయితే ప్రశ్నాపత్రాల డిజిటల్ వాల్యుయేషన్‌పై అనేక మంది అభ్యర్థులు ఏపీ హైకోర్టును ఆశ్రయించడంతో జవాబు పత్రాలను మాన్యువల్‌గా మూల్యాంకనం చేయాలని గతంలో ఏపీపీఎస్సీని హైకోర్టు ఆదేశించిందన్నారు.

ఈ కేసును విచారించిన హైకోర్టు ఇప్పుడు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తూ, మరో ఆరు నెలల్లో మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని ఆదేశించిందని పేర్కొన్నారు. ఏపీపీఎస్సీలో అధికార పార్టీకి చెందినవారే సభ్యులుగా ఉండడం సరైంది కాదన్నారు. 2018 గ్రూపు-1 మెయిన్స్ పరీక్ష రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. హైకోర్టులోనైనా అభ్యర్థులకు న్యాయం జరగడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏపీపీఎస్సీ ఇకనైనా పారదర్శకంగా వ్యవహరించాలని, రానున్న కాలంలోనైనా జవాబు పత్రాలను మాన్యువల్ మూల్యాంకనం చేయాలని కోరారు.

**గ్రూపు-1 మెయిన్ రద్దు నిరుద్యోగ బాధితుల విజయం : ఏఐవైఎఫ్**

ఏపీపీఎస్సీ 2018లో నోటిఫికేషన్ ఇచ్చిన గ్రూపు-1 మెయిన్ పరీక్షలో అనేక అవకతవకలు జరిగాయని నిర్ధారించి ఆ పరీక్షను రద్దు చేసి మరలా మెయిన్ పరీక్షను ఆరు నెలల్లో నిర్వహించాలని కోర్టు తీర్పు ఇవ్వటం నిరుద్యోగ బాధిత అభ్యర్థుల విజయమని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహంకాళి సుబ్బారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 169 పోస్టులతో కూడిన నోటిఫికేషన్ ఇచ్చిందని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మెయిన్ పరీక్ష నిర్వహించారని తెలిపారు. మెయిన్ పరీక్ష పేపర్ వాల్యూయేషన్‌లో ఏపీపీఎస్సీ కార్యదర్శి, సభ్యులు వారికి అనుకూలంగా కొంత మందిని నియమించుకున్నారని చెప్పారు. ఈ అంశంపై గ్రూపు-1 బాధిత అభ్యర్థులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేసి కోర్టును ఆశ్రయించటం జరిగిందన్నారు. ఈ కేసును విచారించిన కోర్టు మెయిన్ పరీక్షను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడాన్ని ఏఐవైఎఫ్ స్వాగతిస్తుందన్నారు. ఏపీపీఎస్సీ అధికార పార్టీ సంస్థగా మారిందని, పోటీ పరీక్షల్లో పాల్గొనే నిరుద్యోగులు కూడా ఏపీపీఎస్సీలో జరుగుతున్న అవకతవకలతో వారికి నమ్మకం పోయిందన్నారు. తక్షణమే సభ్యులను మార్చి, కొత్త వారిని నియమించి గ్రూపు-1 పరీక్షను పారదర్శకంగా నిర్వహించాలని, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎన్నికలకు 'రెఢీ'

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభిస్తారని సమాచారం. అదే రోజు విజయవాడ పశ్చిమ, నెల్లూరు రూరల్ నియోజవర్గాల్లో రోడ్ షోలు, బహిరంగ సభల్లో పాల్గొంటారు. దీనిపై వైసీపీ కేంద్ర కార్యాలయం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఎన్నికలు సమీపించే నాటికి అవసరమైన నియోజకవర్గాలకు మరోసారి వెళ్లి ప్రచారం చేసే అవకాశముంది. ఈ ఎన్నికల ప్రచారానికి సంబంధించి రూట్ మ్యాప్‌ను రూపొందించారు. దీనిపై ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతో వైసీపీ సీనియర్ నేతలు చర్చించారు. జగన్ ఇప్పటివరకు 12 విడతలుగా అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాలకు సామాజిక సమీకరణలతో పార్టీ ఇన్‌ఛార్జిల (అభ్యర్థులు) ను నియమించారు. ఈ జాబితాలో చాలా మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలకు చోటు దక్కలేదు. దీంతో కొందరు అసంతృప్తితో ఉండగా... వైసీపీ అధిష్ఠానం బుజ్జగింపులు చేపట్టింది. తుది జాబితా ప్రకటించిన అనంతరం సీఎం జగన్ పూర్తిగా ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతారు. రోజుకు ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాలను (ఉత్తరాంధ్ర, ఆంధ్ర, రాయలసీమ) కవర్ చేసేలా బహిరంగ సభలు, రోడ్ షోలు నిర్వహిస్తారు. బహిరంగ సభలకు ఆయన ప్రత్యేకంగా రెండు హెలీ కాప్టర్లను సిద్ధం చేసుకున్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సిద్ధం సభల ద్వారా వైసీపీ శ్రేణులకు సీఎం జగన్ ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. నాలుగు చోట్ల నిర్వహించిన సిద్ధం సభలు విజయవంతమైనట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు. రాబోయే ఎన్నికల్లో 175కి 175 అసెంబ్లీలు, 25కి 25 ఎంపీల గెలుపే లక్ష్యమంటున్నారు. ఆ దిశగా ఎన్నికల్లో తనదైన శైలిలో వైసీపీ ప్రచారానికి సన్నద్ధమైంది. కాగా వైసీపీ మేనిఫెస్టోపైనా తుది కసరత్తు కొనసాగుతోంది. కాగా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిలో పొత్తు ఖరారైనప్పటికీ ఎవరెక్కడ పోటీచేయాలనే దానిపై స్పష్టత రాలేదు. సీట్ల విభజన, అభ్యర్థుల ఎంపికలపైనే వారు సమాలోచనలు చేస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో భాగంగా బీజేపీకి పది అసెంబ్లీ, 6 పార్లమెంటు సీట్లను కేటాయించారు. జనసేనకు 21 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ సీట్లు ఖరారు చేశారు. టీడీపీ తన తొలి జాబితాలో 94 మంది అభ్యర్థుల్ని ప్రకటించింది. రెండో జాబితాను ఈనెల 14వ తేదీన ప్రకటించేందుకు సిద్ధమైంది. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమితో ఈనెల 17వ తేదీన చిలకలూరిపేటలో భారీ బహిరంగ సభ ద్వారా ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ సభకు ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్ హాజరవుతారు. అటు జనసేన తనకు కేటాయించిన సీట్లలో ఇప్పటివరకు 6 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన అభ్యర్థులపై ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కసరత్తు చేస్తున్నారు. బీజేపీ ఇప్పటివరకు ఒక్క సీటుకూ అభ్యర్థిని వెల్లడించలేదు.

## మహిళలకు ఏటా రూ.లక్ష సాయం

(మొదటిపేజీ తరువాయి)

విమర్శలు గుప్పించారు. ఇంతకంటే పెద్ద అన్యాయం మరొకటి ఉండదన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 'భాగిదారీ' (భాగస్వామ్య) ప్రతిపాదన అంటే అన్ని కులాలు, వర్గాలను వారి జనాభా ప్రకారం నిర్ణయాలు తీసుకోవడం, వనరులను పంచుకోవడం అని ఆయన అన్నారు. రిజర్వేషన్ల విషయంలో (లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో) మహిళలను కేంద్రం మోసం చేసిందని, దీనికి సంబంధించిన బిల్లును పార్లమెంటు ఆమోదించిందని, అయితే దాని అమలుకు 10 ఏళ్లు పడుతుందని గాంధీ తెలిపారు. తక్షణమే మహిళా రిజర్వేషన్లను తమ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రాహుల్ గాంధీ ప్రసంగానికి ముందు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే ఒక వీడియో ప్రకటనలో మహాలక్ష్మి గ్యారెంటీ ద్వారా పేద మహిళల బ్యాంకు ఖాతాల్లో ఏటా రూ.లక్ష నేరుగా జమ చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. 'ఆధి ఆబాది పుర హక్' అంటే ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం కోటా అని ఆయన అన్నారు. కాంగ్రెస్ హామీలు 'పత్తర్ కి లేకర్' (రాతితో అమర్చబడినవి), 'జుమా' కాదని ఖడ్గే నొక్కి చెప్పారు. అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన పథకాల్లో పనిచేస్తున్న ఆశా, మహిళలకు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ వాటాను రెట్టింపు చేయనున్నట్లు తెలిపారు. 'అధికార్ మైత్రి' లేదా నోడల్ వ్యక్తి మహిళలకు వారి హక్కుల గురించి అవగాహన కల్పిస్తారని, వారి ప్రయోజనాల కోసం పోరాటంలో సహాయపడతారని వివరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో జైరాం రమేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాజ్యాంగ సవరణ ద్వారా రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని రద్దు చేస్తామన్నారు. గత కాంగ్రెస్ హయాంలో ప్రవేశపెట్టిన షెడ్యూల్డ్ కులాల ప్రణాళిక, షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళికలను నరేంద్ర మోదీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. 'జనాభా (వివిధ కులాలు, వర్గాల) ప్రకారం బడ్జెట్ వాటాను నిర్ధారించడానికి మేము చట్టాన్ని తీసుకువస్తాము' అని ఆయన చెప్పారు. దేశంలోని ప్రతి గ్రామ పంచాయతీలో 'అధికార్ మైత్రి' గ్రామీణ ప్రాంతాల్లోని 2.5 లక్షల మంది మహిళలకు ఉపాధి కల్పిస్తుందని, మహిళలకు వారి హక్కుల గురించి అవగాహన కల్పిస్తుందని, వారి సమస్యల కోసం పోరాడుతుందని జైరాం రమేశ్ అన్నారు.

## నాగపట్టణం, తిరుప్పూర్ నుంచి సీపీఐ పోటీ

(మొదటిపేజీ తరువాయి)

సజావుగా సాగిందని చెప్పారు. తమ పార్టీ నాగపట్టణం, తిరుపూరు నుంచి పోటీ చేస్తుందని, తప్పక విజయం సాధిస్తుందని ముతరాసన్ అన్నారు. 'డీఎంకే నేతృత్వ సెక్యులర్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ (ఎస్‌పీఎఫ్)... ఇండియా కూటమిలో ఉన్నది. ఇప్పటికే ఎన్నికల పనిని ప్రారంభించింది. మాకు ఒప్పందం కుదిరింది. ఈ రెండు నియోజకవర్గాలే కాదు, తమిళనాడు, పుదుచ్చేరిలోని 40 నియోజకవర్గాల్లో మా కూటమి విజయం సాధిస్తుందన్న విశ్వాసం ఉంది' అని బాలకృష్ణన్ అన్నారు. అలాగే, తమిళనాడులోని తొమ్మిది స్థానాలతో పాటు పుదుచ్చేరిలో ఒక స్థానం నుంచి కాంగ్రెస్ పోటీ చేయబోతోంది. వీకేసీకి రెండు, ఎండీఎంకే, ఐయూఎంఎల్, కేఎండీకే పార్టీలకు ఒక్కో స్థానం చొప్పున కేటాయించారు. డీఎంకే 21 స్థానాల నుంచి పోటీ చేయనుంది.

# 200 రోజులు పని దినాలు కల్పించాలి

- ఉపాధి హామీ కార్మికులను ఆదుకోవాలి
- కోటేశ్వరరావు, ఆవుల శేఖర్ డిమాండ్

**విశాలాంధ్ర-అనంతపురం అర్బన్:** పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను అమలు చేయటంలో పాలకులకు చిత్తశుద్ధి లేదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్. కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ విమర్శించారు. నగరంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షుడు టి. రంగయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కోటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఉప ప్రధాన కార్యదర్శిఆర్. వెంకట్రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి కేశవరెడ్డి హాజరయ్యారు. వ్యక్తులు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని దేశవ్యాప్తంగా ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌తో ప్రారంభించగా, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక చొరవతీసుకొని ఆంధ్రప్రదేశ్ కు సాఫ్ట్‌వేర్ కావాలని ప్రభుత్వంతో మాట్లాడి ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం టీసీఎస్ సాఫ్ట్‌వేర్ తీసుకువచ్చి రాష్ట్ర పరిధిలో ఉంచుకొని పథకాన్ని అమలు పరిచారని గుర్తు చేశారురీ సాఫ్ట్‌వేర్ వలన పూర్వపు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు పనిచేసుకోవడం జరుగుతోందన్నారు. పథకం ద్వారా ఉపాధి కూలీలకు పనిచేసే చోట మౌలిక వసతులు నీడ సౌకర్యం, పని చేసేటప్పుడు ప్రమాదవశాత్ ఏమైనా గాయాలైన ప్రథమ చికిత్స చేయించుకోవడానికి ఫస్ట్ ఎయిడ్ బాక్స్, కూలీలు పనిచేసే చోటికి త్రాగడానికి నీళ్లు, వేసవికాలం ప్రారంభమైతే ఉపాధి కూలీలు పనికి ఇబ్బందిగా ఉంటుందని ప్రత్యేకంగా సమ్మర్ అలవెన్స్ ఇచ్చేవారన్నారు...అంతేకాకుండా ఉపాధి కూలీలు వేసవికాలంలో వేగంగా ఎండ నుండి ఉపశమనం పొందడానికి ఏప్రిల్ నెల 21 నుంచి మే 31 వరకు పనికి వచ్చిన ప్రతి కూలికి మజ్జిగ ప్యాకెట్ కోసం ఐదురూపాయలు ఇచ్చి ఉపాధి కూలీలను ఆదుకునేవారని చెప్పారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలోనూ వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకున్న వారికి పనిముట్లు సరఫరా చేసేవారు కానీ ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీలకు పనిదినాలు కల్పించలేక పోతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, ఉప ప్రధాన కార్యదర్శి పెద్దయ్య, ఆఫీస్ బేరర్లు సంగప్ప,దేవేంద్ర,చిన్న రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీలోకి టీడీపీ నేత రవికుమార్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత గండి రవికుమార్ వైసీపీలో చేరారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం సీఎం జగన్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రవి కుమార్‌తోపాటు మరో టీడీపీ నేత డీ ప్రసాదరావు కూడా వైసీపీలో చేరారు.ఈ కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజు, వైసీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ భగవాన్ జయరామ్ పాల్గొన్నారు.

**వైసీపీలో ముద్రగడ చేరికకు రంగం సిద్ధం**

కాపు సామాజిక వర్గ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వైసీపీలో చేరికకు రంగం సిద్ధం చేసుకున్నారు. ముందు ప్రకటించినట్లుగా ఈనెల 14 తేదీన కాకుండా, ఈనెల 15 లేదా 16న ఆయన తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిసి పార్టీలో చేరనున్నారు. తొలుత ఈనెల 14వ తేదీన ముద్రగడ నివసిస్తున్న కిర్లంపూడి నుంచి తాడేపల్లికి భారీ ర్యాలీతో వచ్చి పార్టీలో చేరాలని అనుకున్నప్పటికీ అనుమతులు రానందున ఆ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. దీంతో ముందు ఆయనే పార్టీలో చేరి... ఆ తర్వాత తన అనుచరులను చేర్చేలా ప్రణాళిక రూపొందించుకున్నారు.

## సీఏఏపై నోరు మెదపరేం?

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ముస్లిం మైనార్టీల ఉనికిని దెబ్బకొట్టి వారి భవిష్యత్‌ను నాశనం చేస్తున్న పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) రూల్స్ నోటిఫై చేసి దేశాన్ని ప్రమాదంలోకి నెట్టిన బీజేపీ కుతంత్రాలపై వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు ఎందుకు నోరు మెదపడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో నిలదీశారు. మైనార్టీలను ఉద్ధరిస్తానని రోజూ వ్యాఖ్యానించే సీఎం జగన్ ఇప్పుడు ఎందుకు మౌనంగా దాల్చారన్నారు. రాష్ట్రంలో మైనార్టీలపై మెజార్టీ మతస్తులను రెచ్చగొట్టి ఉద్రిక్తతలను సృష్టించాలనుకుంటున్న బీజేపీతో జతకట్టిన టీడీపీ లౌకికవాదాన్ని ఎలా కాపాడుతుందని ప్రశ్నించారు. బీజేపీ దురాగతాలను ప్రశ్నించకుండా వైసీపీ మైనార్టీలను ఎలా రక్షిస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం కులం, మతం, రంగు, జాతి, ప్రాంతం, భాష ఆధారంగా ఎవరిపైనా వివక్ష ఉండకూడదని, సీఏఏ మత ప్రాతిపదికన వివక్ష పాటిస్తుందని వివరించారు. వామపక్షాల మద్దతుతో ఇండియా బ్లాక్ అధికారంలోకి వస్తే సీఏఏ అమల్లోకి రాదని, అదే మైనార్టీలకు రక్ష అని, మత సామరస్యానికి గ్యారెంటీ అని శ్రీనివాసరావు స్పష్టంచేశారు.

**అంగీకరించం: వైసీపీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను తాము అంగీకరించబోమని వైసీపీ ఎమ్మెల్యే ఆఫీస్ ఖాన్ స్పష్టం చేశారు. తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. సీఏఏ చట్టం వల్ల ముస్లిం వర్గాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయని చెప్పారు. ఇందులో మార్పులు చేయాల్సిన అవసరమందన్నారు. ముస్లిం వర్గాలకు సీఎం జగన్ అనునిత్యం అండగా నిలుస్తున్నారని చెప్పారు.

# ఎన్నికలకు సంసిద్ధం కావాలి

- హింసకు తావులేని, తిరిగి పోలింగ్ జరగకూడదన్నవే ప్రధాన అంశాలు
- జిల్లా అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా సమీక్ష

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో హింసకు తావు లేకుండా, తిరిగి ఎన్నిక జరగకుండా జిల్లా ఎన్నికల అధికారులు, పోలీస్ సూపరింటెండెట్లు, పోలీస్ కమిషనర్లు ప్రణాళికాబద్ధంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి బుధవారం అన్ని జిల్లాల అధికారులు, పోలీస్ కమిషనర్లతో ఆయన మీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ఎన్నికల సంసిద్ధతకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీరో వయెలెన్సు, నో రీపోల్ ప్రధాన మంత్రాలుగా ఎన్నికలను నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎలాంటి తేడా వచ్చినా సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలనీ, హింసకు తావు ఉండకూడదని సూచించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు పటిష్ఠంగా పనిచేసే విధంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. బూత్ క్యాప్చరింగ్‌కు ఎటువంటి అవకాశం లేకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. త్వరలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నిరంతర పర్యవేక్షణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళిలోని ముఖ్యమైన అంశాలను ఆయన వివరించారు. ఓటర్ల గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. పోస్టల్ ద్వారానే బట్వాడా చేయాలన్నారు. పాడేరు ప్రాంతం మినహా మరే ఇతర ప్రాంతాల్లో మాన్యువల్‌గా పంపిణీ చేయడానికి వీలులేన్నారు. రాష్ట్ర పోలీస్‌శాఖ చేస్తున్న ఏర్పాట్లను అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్) శంఖ్రత్ బాగ్చీ పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించారు. అదనపు సీఈవో ఎం.ఎన్. హరింధర ప్రసాద్, డిప్యూటీ సీఈవోలు కె. విశ్వేశ్వరరావు, ఎస్.మల్లిబాబు, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## సీఏఏ సత్వర అమలుకు బీజేపీ కుట్ర

- ప్రధాన సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే నోటిఫికేషన్
- సీపీఐ కార్యదర్శి అజీజ్‌పాషా విమర్శ

**విశాలాంధ్ర-హైదరాబాద్:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) సత్వర అమలునకు మోదీ ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, హిందూ రాష్ట్ర స్థాపన దిశగా అడుగులు వేస్తోందని సీపీఐ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్‌పాషా విమర్శించారు. సీఏఏ నిబంధనలను మోదీ ప్రభుత్వం తాజాగా నోటిఫై చేయడం ఎన్నికల వేళ ప్రధాన సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకేనని దుయ్యబట్టారు. ఇది రాజ్యాంగంలోని అధికరణలు 14,15,21కు విరుద్ధమని విమర్శించారు. 2019 నుంచి సుప్రీంకోర్టులో 230 పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని అజీజ్‌పాషా గుర్తుచేశారు. ఎన్నికల బాండ్లు, నిరుద్యోగం, అధిక ధరలు వంటి సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు సీఏఏను తెరపైకి తేవడం మోదీ ప్రభుత్వ ఎన్నికల గిమ్మిక్కు అని విమర్శించారు. 400కుపైగా స్థానాల్లో గెలుస్తామన్న విశ్వాసమున్నప్పుడు విభజన గేమ్‌ప్లాన్ ఎందుకంటూ మోదీని నిలదీశారు. ఐదు ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ, జీ20, రామ మందిర్ ఇవ్వని విశ్వాసం ఈ తాజా చర్యతో బీజేపీకి లభించిందా అని ప్రశ్నించారు. ముస్లింలు ఆందోళన పడాల్సిన పనిలేదంటూ సీఏఏ నోటిఫికేషన్‌ను సమర్థించుకునే ప్రయత్నాన్ని కేంద్రం చేస్తోందని అన్నారు. బీజేపీ ఉచ్చులో చిక్కుకుపోవద్దని, అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా జాతీయ పౌరసత్వ నమోదు (ఎన్ఆర్సీ) అప్‌డేట్‌నకు సీఏఏ వినియోగమవుతుందని, తద్వారా లక్షల మంది పౌరసత్వాన్ని కోల్పోతారన్న ఆందోళన ప్రజల్లో ఉన్నదన్నారు. అస్సామీలుగా గుర్తింపు కోల్పోతమే భయంతోనే అఖిల అసోం విద్యార్థుల సంఘం (ఏఏఎస్‌యూ)... సీఏఏను వ్యతిరేకిస్తోందని, పెద్దఎత్తున ఆందోళన చేపట్టిందన్నారు. 2019-20లో దేశవ్యాప్తంగా పెద్దఎత్తున జరిగిన నిరసనలను ప్రజలు మర్చిపోలేదని తెలిపారు. ఈ నోటిఫికేషన్‌తో 'హిందూ రాష్ట్ర' దిశగా బీజేపీ చకాచకా అడుగు వేస్తోందని స్పష్టమవుతోందని, దీనిని లౌకిక, ప్రజాస్వామ్య వాదులు ప్రతిఘటిస్తారని అజీజ్‌పాషా అన్నారు. బీజేపీ చేసే ప్రయత్నం విఫలమవుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ నిబంధనలు మార్చాలి

### కుల నిర్మూలన వేదిక డిమాండ్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ప్రతిష్ఠాత్మకమైన జాతీయ విద్యా సంస్థల్లో ప్రవేశాలకు 2021-22 విద్యా సంవత్సరంలో సెప్టెంబరు 21వ తేదీకి ముందు ఇంటర్ రాసిన విద్యార్థులు అనర్హులని కేంద్ర విద్యాశాఖ ప్రకటించడం అన్యాయమని, తక్షణమే నిబంధనలు మార్చాలని కుల నిర్మూలన వేదిక (కేవీఎన్) అధ్యక్షుడు పాపని నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీలతోపాటు సెంట్రల్ వర్సిటీ, ఏఐఐఎం, ఐఐఎం, ఐఐఎస్ఈఆర్ తదితర జాతీయ విద్యా సంస్థల ప్రవేశ పరీక్షలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి అధికంగా విద్యార్థులు హాజరయ్యేవారని తెలిపారు. ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 2021-22 సెప్టెంబరు 21కి ముందు ఇంటర్ రాసిన విద్యార్థులు అర్హులు కారని కేంద్ర విద్యాశాఖ ప్రకటించడం తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు తీరని అన్యాయాన్ని తలపెట్టడమే అవుతుందని అన్నారు. ప్రతిఏటా మొదట్లోనే ప్రకటించకుండా నెల రోజుల ముందు ఇలా అనర్హులని ప్రకటించడం సరికాదని, ఇది కుట్రపూరితమని పేర్కొన్నారు. 2019 నుంచి 2022 వరకు దేశంలో కరోనా వ్యాప్తి చెందిందని గుర్తు చేశారు. జాతీయస్థాయి విద్యాసంస్థల్లోకి తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాది రాష్ట్రాల విద్యార్థుల విజయఢంకా మోగిస్తున్న తీరును జీర్ణించుకోలేకే ఇలా వ్యవహరిస్తోందని అన్నారు. ఉత్తర భారత విద్యార్థుల అనుకూలతను చూపుతోందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు, పేదల ప్రవేశాలను సహించలేక ఫీజులను లక్షల్లో పెంచి వారిని దూరం చేస్తున్నారన్నారు. సీట్ల సంఖ్య పెంచాలని, ఓబీసీలు రాకుండా చేయడాన్ని నిరోధించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ, కేంద్రం ఇలాంటి దారుణమైన నిర్ణయాలకు పాల్పడుతోందన్నారు. జాతీయ విద్యా సంస్థల్లో మిగిలిన సీట్లను అర్హత సాధించిన విద్యార్థులతో భర్తీ చేయాలని కోరారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ నిర్వహణ బాధ్యతలను ఈ ఏడాది ఐఐటీ మద్రాస్‌కు కేటాయించారన్నారు.

## ఆర్టీసీ సిబ్బందికి చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో వైద్యసేవలు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:**

చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) ద్వారా వైద్య సౌకర్యాలు అందించేలా ఉత్తర్వులు ఇవ్వడంపై ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన అనంతరం ఉద్యోగులకు ఈహెచ్ఎస్ ద్వారా అందిస్తున్న వైద్య సౌకర్యాలు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లోనూ పొందవచ్చు అని తెలిపారు. ఆయా రాష్ట్రాల్లో వైద్యసౌకర్యాలు పొందిన వారికి మెడికల్ రీయింబర్స్‌మెంట్‌కు కూడా అవకాశం కల్పిస్తూ అధికారులు ఉత్తర్వులు ఇవ్వడంపై ధన్యవాదాలు తెలిపారు. పాత పద్దతుల్లోనే రిఫరల్ ఆసుపత్రుల ద్వారా వైద్యసౌకర్యాలు అందించాలని, అంతవరకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే పీటీడీ ఉద్యోగులకు ఇతర రాష్ట్రాల్లోనూ ఈహెచ్ఎస్ వైద్యసౌకర్యాలు కల్పించాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ ద్వారా తాము చేసిన కృషిమేరకు ఈ ఆదేశాలు వచ్చాయని స్పష్టం చేశారు.

**ముస్లిం ఉద్యోగులకు రంజాన్ ఉపసాలకు అవకాశం**

పవిత్ర రంజాన్ ఉపవాసాలు ప్రారంభమైనందున ఆర్టీసీలో పనిచేస్తున్న ముస్లిం ఉద్యోగులకు సాయంత్రం నాలుగు గంటలకే విధుల నుంచి వెళ్లేందుకు ఉన్నతాధికారులు అనుమతులిచ్చారని ఈయూ తెలిపింది. కార్యాలయ సిబ్బంది, వర్క్‌షాపు, స్టోర్స్, టైర్, ట్రాఫిక్ తదితర విభాగాల సిబ్బంది విధుల్లో సర్దుబాటులు చేస్తూ అవకాశం కల్పించిందన్నారు.

## 4,356 అధ్యాపక పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- వైద్య కళాశాలల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకం
- కలెక్టర్ల పర్యవేక్షణలో 16న ఇంటర్వ్యూలు

**విశాలాంధ్ర-హైదరాబాద్:** రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీర్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2021 అక్టోబరు నుంచి ఖాళీగా ఉన్న 4,356 టీచింగ్ పోస్టులను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయాలన్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థికశాఖ జీవో 98 విడుదల చేసింది. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులు వున్నాయి.వీటి భర్తీతో ఏటా సర్కారుపై అదనంగా రూ.634 కోట్ల భారం పడుతుందని మంత్రి తెలిపారు. మెడికల్ కళాశాలల్లో అధ్యాపకుల నియామకాలన్నీ జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీ (డీఎస్‌సీ)ల ద్వారా సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. వైద్య కళాశాలల బలోపేతానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. జాతీయ వైద్య కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడానికి పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. కాలేజీల వారీగా పోస్టుల వివరాలను ఆయా వెబ్‌సైట్లలో పొందుపర్చారు. కళాశాల వెబ్‌సైట్ల వివరాలు డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్ htpps://dme.telangana.gov.in లో ఉన్నాయి. అన్ని కాలేజీల్లో ఈ నెల 16న వాక్-ఇన్-ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అర్హతలున్న అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

## గొప్ప కథకుడు విజయరామరాజు

### సాహితీ పురస్కార సభలో అరసం జాతీయ అధ్యక్షుడు 'పెనుగొండ'

**విశాలాంధ్ర-గుంటూరు :** అట్టడుగు ప్రజాజీవితాన్ని కథల్లో సజీవంగా ఆవిష్కరించిన గొప్ప కథకుడు డాక్టర్ నక్కా విజయరామరాజు అని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. డాక్టర్ పరుచూరి రాజారామ్ 84వ జయంతిని పురస్కరించుకుని రాజారామ్ సాహితీ పురస్కార సభ సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయ ఆవరణలో బుధవారం సాయంత్రం జరిగింది. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో విజయరామరాజు రచించిన 'సుబ్బమ్మ మెస్' ఇతర కథల సంపుటిని పెనుగొండ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాంతీయత, స్థానికత, వాస్తవికతల త్రివేణీ సంగమం విజయరామరాజు కథలు అన్నారు. యానాదుల దిబ్బ, సుబ్బమ్మ మెస్ వంటి కథలు ఇందుకు ఉదాహరణ అని అన్నారు. కథాసంపుటి తొలి ప్రతిని, సుబ్బమ్మ మెస్‌కు చెందిన సుబ్బమ్మ మనుమరాలికు రచయిత అందజేశారు. కథాసంపుటిని డాక్టర్ నూకతోటి రవికుమార్ పరిచయం చేశారు. వాదాల్ని సమర్థించడానికి, కథలు రాయలేదన్నారు. ఆయన కథల్లో అత్యుత్తమమైన మానవీయత ఉంటుందన్నారు. కథారచయితగా అందుకుంటున్న గొప్ప సత్కారం రాజారామ్ సాహితీ పురస్కారం అన్నారు. కుటుంబ సభ్యుల్ని, అరసంను అభినందించారు. పరుచూరి అజిత ప్రసంగిస్తూ 22 సంవత్సరాలుగా ఈ పురస్కారాన్ని ఇస్తున్నాం. కానీ వైద్యవృత్తిలో ఉన్న కథకునికి అవార్డు ఇవ్వడం ఇదే ప్రథమం అన్నారు. శివప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ పరుచూరి రాజారామ్ రచయితగా అరసం ఉద్యమకారుడిగా తమకు మార్గదర్శి అన్నారు. విజయరామరాజుకు డాక్టర్ పరుచూరి రాజారావు సాహితీ సత్కారం, రూ.10 వేల నగదు, జ్ఞాపికను అజిత, పెనుగొండ అందజేశారు. ఈ సత్కారం తన జీవితంలో గొప్ప గౌరవంగా మిగిలిపోతుందని విజయరామరాజు అన్నారు. రచయిత డాక్టర్ కేశవ రెడ్డి తనను ప్రభావితం చేశారని చెప్పారు. తొలుత అరసం రాష్ట్ర కార్యదర్శి కె.శరత్ స్వాగతం పలికారు.

## సఫాయికర్మచారీలకు పీపీఈ కిట్‌ల అందజేత

**విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు :** సమాజంలో వెనుకబడిన వర్గాలయిన సఫాయికర్మచారీ లబ్ధిదారులకు ఎన్ఎస్ఎఫ్‌డీసీ, స్త్రీ నిధి, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, పీపీఈ కిట్‌లను రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అందజేశారు. బుధవారం స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో ప్రధాన మంత్రి సూరజ్ జాతీయ పోర్టల్ ప్రారంభోత్సవంలో గవర్నర్ పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జరిపిన ఇంటర్ యాక్షన్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి జమ్మూకశ్మీర్, మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాల్లోని లబ్ధిదారులతో మాట్లాడి వారికి అందుతున్న పథకాలు, వారి జీవితాల్లో కలిగిన మార్పును తెలుసుకున్నారు. రాష్ట్రంలోని గుంటూరు జిల్లా నుంచి ఒక సఫాయి కార్మికురాలు మోదీతో మాట్లాడారు. రోడ్ల పక్కన ఉండే మాకు ప్రభుత్వం గ్యాస్, హెల్త్ కార్డు వంటి అనేక పథకాలతో పాటు వృత్తి చేసుకోవడానికి రూ.17 లక్షల విలువ చేసే యంత్రం అందజేసిందని, ఇప్పుడు దానికి తాను యజమానురాలు అయ్యాయని ఆమె ప్రధానికి వివరించారు. ప్రభుత్వం సెప్టిక్ ట్యాంక్ క్లీన్ మిషన్ అందజేయడం వల్ల తన కుటుంబ పోషణకు భరోసా లభించిందని ఆమె ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నట్లు వివరించింది. జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ మాట్లాడుతూ పేద, అణగారిన వర్గాల ఉద్ధరణ, సాధికారికత కోసం పీఎం సూరజ్ పథకం పేదల పట్ల ఉన్న ప్రత్యేక దృష్టిని తెలియజేస్తోందన్నారు. జిల్లాలో 766 మందికి ఈ పథకం అందనున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ 296 మంది, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీలు 25 మంది, ఎన్‌బీసీఎఫ్‌డీసీలో 356 మంది, నమస్తే పథకంలో 89 మంది లబ్ధి పొందుతున్నారన్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు మందికి, మరో 50 మందికి పీపీఈ కిట్‌లు అందిస్తామన్నారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకం కింద రూ.5 కోట్ల 20 లక్షల చెక్కును గవర్నరు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉదయగిరి ఉడ్డెన్ కట్లెరీ జ్ఞాపికను వేదికపై గవర్నర్‌కు అంద జేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుమ్మ, మేయర్ స్రవంతి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ రైతుభరోసా: భట్టి విక్రమార్క

**విశాలాంధ్ర-హైదరాబాద్:** రాష్ట్రంలో అర్హత కలిగిన రైతులందరికీ రైతు భరోసా అమలు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మక్తల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, కొండలు, రాళ్లు, రోడ్లు, భూస్వాములకు కాకుండా సాగు చేసుకుంటున్న నిరుపేద రైతులకు రైతుభరోసా అందాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. తొలుత ఒక ఎకరంతో మొదలుపెట్టి మూడు ఎకరాల రైతులకు నగదు జమ చేశామన్నారు. తాజాగా నాలుగు ఎకరాల రైతులకు డబ్బులు వేస్తున్నామనీ, త్వరలోనే మిగిలిన రైతులందరికీ నగదు జమ చేస్తామన్నారు. నిరుపేదలు 200 యూనిట్ల వరకు కరెంటు బిల్లు కట్టాల్సిన పని లేదన్నారు. లబ్ధిదారుల పేర్లు పొరపాటున లిస్టులో రాకపోయినా బిల్లు కట్టాల్సిన పనిలేదని వారిని ఒత్తిడి చేయొద్దని అధికారులకు స్పష్టంగా చెప్పినట్టు భట్టి పేర్కొన్నారు. అర్హులు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి కరెంట్ బిల్లు, తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు అందించి జీరో బిల్లు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం, మహాలక్ష్మి పథకం కింద ఆడబిడ్డలు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని ప్రారంభించాం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభించామన్నారు. ఇటీవలే భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. దివంగత నేత, మాజీ సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే రాష్ట్రంలో జలయజ్ఞం కార్యక్రమాన్ని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందన్నారు.

## 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు

### నాలుగు నెలల్లో నిర్మాణం పూర్తి: తుమ్మల

**విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం:** ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను అందించే లక్ష్యంతో సీతారామ ప్రాజెక్టు నుంచి వైరా రిజర్వాయర్ లోకి వచ్చే లింకు కెనాల్ నిర్మాణానికి బుధవారం మంత్రులు వైరాలో శంకుస్థాపన చేశారు. ఈ కెనాల్ ద్వారా దాదాపు 1,20,000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. వైరా రిజర్వాయర్ కుడి కాల్వ లాకుల వద్ద జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. శంకుస్థాపన అనంతరం వెంటనే హెలికాప్టర్లో డిప్యూటీ సీఎం భట్టి సహా ఇతర మంత్రులు హెలికాప్టర్లో హైదరాబాద్‌కు వెళ్లిపోగా... అనంతరం వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్ అధ్యక్షతన జరిగిన సభలో తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ నాలుగు నెలల్లో 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు లభించనుందని చెప్పారు. వచ్చే ఆగస్టు 15 తేదీ నాటికి సీతారామ ప్రాజెక్టు లింకు కెనాల్ ద్వారా గోదావరి నీరు వైరా రిజర్వాయర్ లోకి వస్తాయని తెలిపారు.

సంపాదకీయం

## ముస్లింల మీద వేలాడుతున్న కత్తి

ఎన్నికల్లో విజయం సాధించడానికి మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రయోగించే పాచికలు అవసరాన్నిబట్టి మారతాయి కానీ ముస్లింల వ్యతిరేకత అన్న అసలు లక్ష్యంలో మాత్రం ఏ మార్పూ ఉండదు. 2019లో మోదీ ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం (సి.ఎ.ఎ.) తీసుకొచ్చింది. ఈ చట్టం ఇస్లాం మత గౌరవాన్ని పరిరక్షించడానికి ఉద్దేశించదని మోదీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. కానీ ఈ చట్టాన్ని నిశితంగా పరిశీలిస్తే అందులో ఉన్న ముస్లిం వ్యతిరేకత కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. పౌరసత్వ చట్టంచేసి నాలుగేళ్లయినా దానికి సంబంధించిన నిబంధనలను రూపొందించలేదు. ఇప్పుడు హఠాత్తుగా ఎన్నికల బాండ్ల విషయంలో సుప్రీంకోర్టు ప్రభుత్వ అధీనంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్.బి.ఐ.)కి మొట్టికాయలు వేసిన రోజునే పౌరసత్వ చట్టం నిబంధనలు విడుదలైనాయి. నిబంధనలు సిద్ధం అయ్యాయి కనక ఈ చట్టం అమలు చేయడమే తరువాయి. దేశానికి రాజాధిరాజుగా వెలిగిపోతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆయనకు నమ్మిన బంటు, సకల కుహకాల్లో భాగస్వామి అయిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా కలిసి మాంత్రికుడు టోపీలోంచి కుందేలు పిల్లను తీసినట్టు పౌరసత్వ సవరణ చట్టం నిబంధనలను వెల్లడించారు. ఈ నిబంధనల నిండా ముస్లిం వ్యతిరేక కుళ్లు కంపే ఉంది. ముస్లింలను శత్రువులుగా చూపించి మెజారిటీ మతస్థులైన హిందువుల మనసుల్లో అభద్రతా భావం కల్పించి హిందువుల ఓట్లు దండుకోవాలన్న కుటిలయత్నంలో భాగమే సి.ఎ.ఎ. నిబంధనల సారాంశం. పౌరసత్వ సవరణ చట్టాన్ని, జాతీయ పౌరుల జాబితా (ఎన్.ఆర్.సి.)ను అమలుచేసి తీరుతామని అమిత్ షా ఇటీవలి కాలంలో అనేకసార్లు ప్రకటించారు. హిందువుల హృదయ సామ్రాట్ అనిపించుకోవాలని మోదీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి, ఆ మాటకు వస్తే గుజరాత్ మారణకాండ జరిగినప్పటినుంచి సకలవిధ ప్రయత్నాలూ చేస్తున్నారు. కాంగ్రెస్‌కు అరవైఏళ్లు అధికారం ఇచ్చారు, నాకు అరవై నెలలు ఇవ్వండి చాలు అవినీతిని నిర్మూలించి దేశమంతా అలికి ముగ్గులు పెడతానని ఊదరగొట్టి అధికారం సంపాదించిన మోదీ 120 నెలలు గడిచినా సాధించేదేమిటో చెప్పుకోవడానికి పెద్దగా ఏమీ లేనందు వల్ల సి.ఎ.ఎస్. నిబంధనల ముసుగులో మళ్లీ హిందూ–ముస్లిం రాజకీయాలను ఆశ్రయిస్తున్నారు. మోదీ ఏం చేసినా దాని వెనక ఎన్నికలలో లబ్ధి పొందాలన్న ఆకాంక్ష బలంగా ఉంటుంది. దీనికి ఒక్క ఉదాహరణ చాలు. ఇటీవల సందర్భంతో నిమిత్తం లేకుండా దేశంలోకెల్లా అత్యధికంగా బట్వాడా అయ్యే ఓ ఇంగ్లీషు దినపత్రికలో "ప్రతి ఏడాదీ మోదీ సైనికుల మధ్య దీపావళి జరుపుకుంటారు" అన్న పూర్తి పేజీ వ్యాపార ప్రకటన విడుదల చేశారు. మోదీ చేసిన వాగ్దానాలన్నీ బూటకంగా తేలిపోయాయి. నిత్యం అబద్ధాలతో కాలం వెళ్లబుచ్చుతారని జనం గ్రహించారు. అందుకని బీజేపీ అధికార సోపాన పటంలో పెద్ద నిచ్చెనగా ఉపకరించిన హిందూ–ముస్లిం రాజకీయాలను మరో సారి తెర మీదకు తెస్తున్నారు. అందులో భాగమే సి.ఎ.ఎ. నిబంధనలు. "మేరా భారత్, మేరా పరివార్" అన్న మోదీ మంత్ర జపం నిండా విద్వేషమే విరజిమ్ముతూ ఉంటుంది.

అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో మతపరంగా పీడనకు గురయ్యే వారు భారత్‌కు వచ్చి పౌరసత్వం స్వీకరించదలిస్తే ఇంతకు ముందున్న 11 ఏళ్ల గడువును సీఏఏలో అయిదేళ్లకు తగ్గించామని మోదీ ప్రభుత్వం చెప్పుకుంటోంది. ముస్లిం మెజారిటీ దేశాలైన అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లో మతపరమైన పీడనకు గురైనవారు 2014 డిసెంబర్ 31 న భారత్‌లోకి ప్రవేశించిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు మొదలైన మతాల వారికి భారత పౌరసత్వం ఇస్తారట. ఇందులో ముస్లింలను పనిగట్టుకుని మినహాయించారని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ముస్లింల విషయంలో బాహాటంగా వివక్ష చూపడమే మోదీ నాయకత్వంలోని బీజేపీ లేదా సంఘ్ పరివార్ అసలు ఉద్దేశం. అదే నోటితో స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి భారత ముస్లింలు ఎప్పటిలాగే తమ హక్కులను హాయిగా అనుభవించవచ్చునని చెప్తున్నారు. ఆ మూడు దేశాలలో మతపరంగా పీడనకు గురయ్యే వారు భారత్ పౌరసత్వం పొందవచ్చు అని చెప్తున్న సమయంలో భారతీయ ముస్లింల ప్రస్తావన ఎందుకో తెలియదు. ఆ దేశాల నుంచి వచ్చే ముస్లింలను భారత పౌరసత్వం స్వీకరించడానికి అనర్హులను ఎందుకు చేశారో సమాధానం ఉండదు. నిజానికి పీడన కేవలం మతపరమైందే కానక్కరలేదు. రాజకీయ, జాతి సంబంధ, స్త్రీ–పురుషుల మధ్య తేడా చూపే పీడనా ఉంటుంది. మతపరమైన పీడనను మాత్రమే పరిగణించడంలో బీజేపీ ముస్లిం వ్యతిరేకత బాహాటంగా కనిపిస్తోంది. అంతెందుకు పాకిస్థాన్ లోనే ఇస్లాం మతాన్ని అవలంబించే వారైనప్పటికీ మహమదీయులు పీడనకు గురవుతున్నారు. వారికి భారత పౌరసత్వం ఇవ్వడానికి నిరాకరించడం వారు ముస్లింలు అయినందువల్లే కదా! సి.ఎ.ఎ.వల్ల 18 కోట్ల మంది భారతీయులకు ఎలాంటి ప్రమాదమూ లేదని అమిత్ షా నమ్మబలుకుతున్నారు. ఏ భారతీయ పౌరుడూ తన పౌరసత్వానికి దాఖలా చూపించనక్కర్లేదంటున్నారు. శరణార్థులు, చొరబాటుదార్లు అంటే ఎవరో అమిత్ షా అనుమానాలకు తావు లేకుండా వివరించారు. ఎన్.ఆర్.సి. కేవలం బెంగాల్‌కే కాదు దేశమంతటికీ వర్తింపచేస్తామన్నారు. మరి పత్రాలు చూపించనక్కర్లేదు అన్న మాట బూటకమేగా! ముందు సి.ఎ.ఎ. తరవాత ఎన్.ఆర్.సి. అమలు చేస్తామని కూడా చెప్పారు. ఎందుకంటే చొరబాటుదార్లు దేశమంతటా ఉన్నారట. సి.ఎ.ఎ., ఎన్.ఆర్.సి. అమలైతే ఒక్క చొరబాటుదారుడికీ రక్షణ ఉండదన్నారు. చొరబాటుదార్లను సహించనక్కరలేకపోవచ్చు. షా నిర్వచనం ప్రకారం చొరబాటుదార్లంటే ముస్లింలే. అసోంలో ఎన్.ఆర్.సి. అమలు చేసినప్పుడు దాదాపు 20 లక్షల మంది భారత పౌరులు కాకుండా పోయారు. ఎందుకంటే వారి దగ్గర పత్రాలు లేవు. ఈ దేశంలోనే పుట్టి పెరిగిన ఏ భారతీయుడి దగ్గర పౌరసత్వ పత్రాలున్నాయిగనక! అసోంలో పౌరులు కాకుండా పోయిన వారిలో అత్యధికులు హిందువులే. హిందువుల దగ్గర రుజువులు లేకపోయినా పరవాలేదు కానీ ముస్లింలు పత్రాలు చూపించకపోతే వేటు తప్పదన్న అంతరార్థం అమిత్ షా మాటల్లో ద్యోతకం అవుతూనే ఉంది. వారందరినీ చొరబాటుదార్లుగా లెక్క కద్తారేమో. ఆ మూడు దేశాల నుంచి వలస వచ్చిన వారిని వెనక్కు పంపించబోమని షా చెప్పిన మాట కూడా పచ్చి అబద్ధమే. వెనక్కు పంపించడానికి ఆ దేశాలతో ఒప్పందం ఏదీలేని మాటా నిజమే. విదేశీయుల చట్టంలోని 3వ సెక్షన్, పాస్ పోర్టు చట్టంలోని 5వ సెక్షన్ ప్రకారం ప్రభుత్వం చట్టవిరుద్ధంగా మన దేశంలో ఉంటున్న వారిని వెనక్కు పంపించవచ్చు. చట్ట విరుద్ధంగా వచ్చిన వారిని జైళ్లలోనో లేదా నిర్బంధ శిబిరాల్లోనో ఉంచుతారు. వారికి ఓటు హక్కూ ఉండదు. మైన్మార్, చైనా, శ్రీలంక నుంచి వచ్చే వారికి ఈ చట్టం వర్తించకపోవడం మరో విచిత్రం. అంటే ఇస్లాం మతం విషయంలో మోదీ ప్రభుత్వం కచ్చితంగా వివక్ష చూపుతోంది. సి.ఎ.ఎ. ముస్లింల మీద వేలాడుతున్న కత్తి.

## దాపరిక విధ్వంసకుడు బత్రా

ఉద్యోగ విరమణ జీవితంలో ఓ అనివార్య ఘట్టమే తప్ప ఇతరత్రా వ్యాపకాలు పెట్టుకోకూడదని, క్రియాశీలంగా ఉండకూడదనీ కాదు. ఉద్యోగ విరమణానంతరం చేసిన పనివల్లే నలుగురికీ తెలిసిన మనుషులుగా ఉంటారు. ఎన్నికల బాండ్ల గుట్టు బయట పెట్టిన వారిలో భారత నౌకా దళంలో ఏర్ కమాండోర్‌గా పని చేసిన లోకేశ్ బత్రా గురించి చెప్పిన తరవాతే మరెవరి పేరైనా ఎత్తాలి. లోకేశ్ బత్రా 1967 మే 22న భారత నౌకాదళంలో చేరారు. 1971లో భారత–పాకిస్థాన్ యుద్ధంలో పశ్చిమ ప్రాంత యుద్ధ రంగంలో పాల్గొన్నారు. ఉద్యోగ విరమణ తరవాత ఆయన కావాలంటే మరేదో పని వెతుక్కోగలిగే వారే. లేదా ఏదో స్వచ్ఛంద సంస్థలో చేరగలిగే వారే. కానీ ఆయన తనకు ఇష్టమైన పని చేయాలనుకున్నారు. పరిపాలనలో జరిగే అక్రమాలను, అవకతవకలను బయట పెట్టడానికి 2005 నాటి సమాచార హక్కు చట్టాన్ని ఆయనంతగా సద్వినియోగం చేసిన వారు తక్కువ. 2017లో మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎన్నికల బాండ్ల బండారం బయట పెట్టడానికి బత్రా కనీసం 80 సార్లు సమాచార హక్కు చట్టం (ఆర్.టి.ఐ.) కింద దరఖాస్తులు పెట్టారు. అందిన సమాచారం ఆధారంగా మరింత లోతుకెళ్లి చూడడానికి ఆయన మళ్లీ సమాచార హక్కు చట్టాన్నే ఆయుధంగా చేసుకున్నారు. ఆయన సేకరించిన సమాచారం కట్టలు కట్టలు పోగైంది. ఎన్నికల బాండ్ల దుర్నీతిని బయట పెట్టడానికి నిరంతరం పాటుబడ్డ రిపోర్టర్స్ కలెక్టివ్‌కు చెందిన నిథిన్ సేథీ, తపస్య లాంటి వారితో పాటు ది న్యూస్ మినట్, హఫ్ పోస్ట్ లాంటి మీడియా సంస్థల పరిశోధ నాత్మక కథనాలకు ఆయన సంపాదించిన సమాచారమే ప్రధాన ముడి సరుకు. ఎన్నికల బాండ్ల చీకటి కోణాలను చీల్చడానికి ఎంతగా పోరాడారో, ఊరు పేరు బయట పెట్టకుండా

తన మీద దాడి చేసే వారిని ఎదుర్కోవడానికీ బత్రా అంతకన్నా తీవ్ర పోరాటమే చేయవలసి వచ్చింది. ప్రభుత్వం ప్రజలదైనప్పుడు పరిపాలనలో దాపరికం ఉండకూడదన్నది ఆయన తపన. అందుకే నిరంతరం ఆర్.టి.ఐ.ని వినియోగించి పరిపాలనా విభాగాలు దాచే అంశాల గుట్టు విప్పారు. ఆయన కృషి కేవలం ఎన్నికల బాండ్లకే పరిమితం అయింది కాదు. హిందీలో ఆర్.టి.ఐ. చట్టానికి అవసరమైన మార్పులు చేయిం చడం, 2007లో జరిగిన నిఠారీ వరస హత్య కేసులో పోలీసుల దర్యాప్తులో అక్రమాలను అడ్డుకోవడం, ప్రధానమంత్రి మోదీ విదేశీ పర్యటన లకు ఎంత ఖర్చు అయిందో బయట పెట్టించడం, పి.ఎం.కేర్స్ ఫండ్, ప్రధానమంత్రి సహాయ నిధి లెక్కలు బయటపెట్టేట్టు చేయడంలో బత్రా విరామం లేకుండా శ్రమించారు. రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే వారికి ప్రోత్సాహకాలు ఎందుకన్నది ఆయన ప్రశ్న. ఎన్నికల బాండ్లకింద ఇచ్చిన విరాళాలో 45 శాతం చెక్కులు, డిమాండ్ డ్రాఫ్టుల రూపంలో ఇచ్చారని, దాపరికం ఏ మాత్రం ఉండకూడదంటే ఇవన్నీ డిజిటల్ విధానంలోనే చెల్లిం చేట్టు చేయాలని ఆయన ఎంత పోరాడారో! ఏ పార్టీకి ఎవరు ఎంత విరాళం ఇచ్చారన్నది ప్రజలకు తెలియాలంటారు బత్రా. ఎన్నికల బాండ్ల వల్ల ద్రవ్య అక్రమ చెలామణి పెరుగుతుందని, విరాళాలు ఇవ్వడంకోసం డొల్ల కంపె నీలు తామర తంపరగా పుట్టుకొస్తాయని బత్రా ఇంతకాలం చెప్తున్న మాట అంతిమంగా నిజమైంది. ఎన్నికల్లో పోటీ చేసే వారు తమ ఆస్తిపాస్తులు, అప్పుల వివరాలు ఎన్నికల కమిషన్ కు అందజేస్తున్నప్పుడు ఎన్నికల్లో పెట్టే ఖర్చు తమకు ఎక్కడినుంచి అందిందో కూడా చెప్పాలన్న బత్రా వాదన చివరకు నిజమైందిగా. మొత్తం 20వేలపై చిలుకు ఎన్నికల బాండ్లలో 95 శాతం బాండ్లు కోటి రూపాయలకన్నా ఎక్కువ విలువైన వేనని ఆయన లాగినా కూపీ ఒక్కటి చూస్తే ఎక్కువగా రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చింది ఎవరో తేలిపోతోంది. వీరి పేర్లు బయటకు రాకూడా ఉండడానికి మోదీ ప్రభుత్వం వేయని పాచికలేదు. వీటన్నిం టినీ ఎండగట్టింది లోకేశ్ బత్రా. ఆర్.టి.ఐ. ద్వారా మనం పరిపాలనలో భాగస్వాములం కావచ్చునని, ఎన్ని కల ప్రక్రియను సంస్కరించవచ్చునని బత్రా గట్టిగా నమ్ముతారు. ఎన్నికల బాండ్ల కూపీ లాగడానికి ముందే ఆర్.టి.ఐ. చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వం దాచే రహస్యాలను బయట పెట్టడానికి బత్రా పోరాటం కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రజల చేతిలో పరమ ఆయుధం అయిన ఆర్.టి.ఐ. చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి మోదీ ప్రభుత్వం పన్నిన కుట్రలెన్నో గమనిస్తే బత్రాలాంటి వారి అవసరం ఎంతుందో అర్థం అవుతుంది. రహస్యాలు వెల్లడ య్యేట్టు చేయడానికి ప్రభుత్వంతో ఎందుకు గొడవ తెచ్చుకుంటారు అని అడి గితే అది తన తత్వం అంటారు బత్రా. నౌకాదళంలో పని చేసేటప్పుడూ ఇలాగే ఉండేవాడినంటారు. వ్యవస్థలో మార్పులు రావాలంటారు. పరిపాల నలో భాగస్వాములం కావాలంటే సమాచారం కావాలి కదా అని ఉద్వేగంగా అడుగుతారు. ఆర్.టి.ఐ.వల్ల అనేక మార్పులు వచ్చాయనీ ఎవరో ఒకరు ఈ పని చేయకపోతే ఎలా అని ప్రశ్నిస్తారు. ప్రశ్న ముందు పుట్టి ఆయన తరవాత పుట్టినట్టున్నారు. అన్యాయాన్ని ఎదిరించడమే బత్రా జీవ లక్షణం. ఆయన వాడిన ఆయుధమల్లా ఆర్.టి.ఐ. చట్టమే. వయోభారం ఆయన వెన్నుముకను బలహీన పరచలేక పోయింది. ఎన్నికల బాండ్లు చట్ట విరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం అని సుప్రీంకోర్టు నిష్కర్షగా చెప్పగలిగిందంటే దాని వెనక లోకేశ్ బత్రా లాంటివారి నిస్వార్థ కృషి, పట్టుదల, నిజాయితీయే కారణం. డబ్బు సంచుల బలంతో ఎన్నికలలో విజయం సాధించాలన్న మోదీ కుట్ర సాగకుండా చేయడంలో బత్రా పాత్ర ఎప్పుడూ గుర్తు పెట్టుకోవాలి. అందరూ ఆయనలా పోరాడలేక పోవచ్చు. కానీ అలాంటి వారి పాత్రను గుర్తించ డానికి, ప్రోత్సహించడానికి ఏ త్యాగమూ అక్కర్లేదు. సత్యనిష్ఠ ఉంటే చాలు. సత్యం కోసం పోరాడాలంటే త్యాగ బుద్ధి, ఓరిమి కావాలి. కొరతంతా దానిదే. ఆయన పోరాటాన్ని సహించలేని వారు గౌరీ లంకేశ్‌కు ఏ గతి పట్టిందో తెలుసుగా అని హెచ్చరించిన సందర్భాలున్నాయి. కానీ ఉద్యోగ విరమణ చేసి రెండు దశాబ్దాలు దాటినా ఆయనలోని పోరాట స్ఫూర్తి చల్లారలేదు. బాండ్ల విషయంలో నిజం దాస్తున్నది అత్యున్నత స్థానంలో ఉన్నవారేనని బత్రా చెప్తారు. ఆయన గురి ఎవరి మీదో విప్పి చెప్పనవసరం లేదుగా!

– అనన్య వర్మ

# బాబు నెత్తిన భస్మాసుర హస్తం

ఎంసీ వెంకటేశ్వర్లు

బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ కూటమి, "ఇండియా" కూటమి మధ్య త్వరలో లోక్‌సభ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా జరుగనున్నాయి. ఆదే సందర్భంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు జరుగనున్న ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. పోలీసు, అధికార యంత్రాంగాలను కీలు బొమ్మలుగా చేసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రం అండతో శాసనసభ ఎన్నికలను ఏకపక్షం చేసుకోవాలనుకున్న ప్రయత్నాలకు అడ్డుకట్టపడింది. టీడీపీ–జనసేన కూటమిలో బీజేపీ చేరడంతో రాష్ట్ర ఎన్నికలు ఉత్కంఠభరితం కానున్నాయి. అయితే జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించడానికి టీడీపీ, జనసేన పార్టీలకు కనీసం ఒక శాతం కూడా ఓట్లులేని బీజేపీతో పొత్తు అవసరమా అన్న సందేహాలు రాష్ట్ర ప్రజల్లో ఉన్నాయి. చంద్రబాబు నాయుడు అవకాశవాద రాజకీయాలకు పాల్పడు తున్నాడని, భవిష్యత్‌లో బాబుకు బీజేపీ భస్మాసుర హస్తం కానున్నదని విమర్శలు ఎదురవు తున్నాయి. ఈ కలయిక వలన ముస్లిం మైనారిటీలు దూరమవుతారని, బాబుకు ఓట్లు, సీట్లు తగ్గుతాయి తప్ప లాభంలేదని సొంత పార్టీ నాయకులే పెదవి విరుస్తున్నారు. మరోపక్క రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలను, ప్రజా ఉద్యమాలను కర్కశంగా అణచివేస్తూ, అవినీతి, అక్రమాలు, అరాచకత్వానికి పాల్పడుతున్న జగన్ మోహన్‌రెడ్డి నియం తృత్వ పాలనకు అంతం పలకడానికి బీజేపీతో మైత్రి అవసరమన్న అభిప్రాయం బలంగా ఉన్నమాట వాస్తవమే. కాని రాష్ట్ర ప్రయోజనాలకు మాత్రమే బీజేపీని కూటమిలో చేర్చుకున్నామని చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది.

ప్రధాని నరేంద్ర మోదీ దశాబ్దాలపాలన: చంద్రబాబునాయుడు ఐదు సంవత్సరాలు, జగన్‌మోహన్‌రెడ్డి ఐదు సంవత్సరాల పాలన ఒకసారి పరిశీలిస్తే బాబు, పవన్‌ల అసంబద్ధ వాదన, డొల్లతనం బహిర్గత మవుతుంది. ఈ నాటికి ప్రధాన చర్చనీయాంశంగా ఉన్న ప్రత్యేక హోదాను ఉద్దేశపూర్వకంగా నిరాకరించిన చరిత్ర మోదీ, అమిత్‌షాలది కాదా? రాష్ట్ర విభజనపై పార్లమెంట్ ఆమోదించిన చట్టం దశాబ్దాల కాలంగా అమలు కాకపోవడానికి బాధ్యత కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంది కాదా? రాష్ట్ర విభజనపై తల్లి, బిడ్డను వేరుచేసిన కాంగ్రెస్ బిడ్డను మరిచిపోయిందని, తాను అధికారంలోకి వస్తే తల్లిని, బిడ్డను సంరక్షిస్తానని 2014 ఎన్నికల సందర్భంగా తిరుపతి బహిరంగ సభలో ప్రధాని మోదీ మాత్రం తాను చెప్పిన మాటలను విస్మరించి పోలవరం ప్రాజెక్టుతో సహ విభజిత రాష్ట్రాభివృద్ధిని అడ్డుకున్నాడన్నది నగ్నసత్యం. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచింది, గత ఐదుసంవత్సరాలుగా అవినీతి కేసులు విచారణకు రాకుండా కాపాడింది మోదీ, అమిత్‌షాలు కాదా? విభజన హామీలను నెరవేర్చలేదని, ప్రత్యేక హోదా విషయంలో రాష్ట్రానికి తీరని ద్రోహం చేశాడని మోదీపై ఆరోపణలు చేసి 2019 ఎన్నికలకు ముందు ఎన్‌డీఏతో తెగతెంపులు చేసుకొని కర్నాటకలో జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీతో చేతులు కలపడం వాస్తవం కాదా? అదే చంద్రబాబునాయుడు 2024 ఎన్నికల నాటికి రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్‌డీఏతో కలుస్తున్నామని చెప్పడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడం కాదా? మోదీ వైఖరిలో మార్పువచ్చిందా లేక అధికారం కోసం బాబు మోదీ ముందు సాగిల బడ్డాడా? ఈ సందేహాలన్నిటిని నివృత్తి చేయవలసిన నైతిక బాధ్యత చంద్రబాబుపై ఉంది.

వాస్తవానికి బీజేపీలో మార్పు వచ్చిందని కాని, రాష్ట్రాభివృద్ధి ఎడల మోదీకి ప్రేమ పెరిగిందని భావిస్తే అది భ్రమ మాత్రమే. రాష్ట్రాన్ని అప్పులు ఆంధ్రప్రదేశ్‌గా మార్చడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతపాత్ర ఉన్నదో, ప్రధాని నరేంద్రమోదీకి అంతేపాత్ర ఉన్నదనుట యదార్థం. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చే నిధులు, పంచాయతీలకు ఇచ్చే గ్రాంట్లు దుర్వినియోగమవుతున్నా కేంద్రం ఏ మాత్రం పట్టించు కోలేదన్నది జగమెరిగిన సత్యం. విభజిత రాష్ట్ర ప్రయోజనాలకు సహక రించడంలో గత చంద్రబాబునాయుడు, నేటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాలకు మోదీ ప్రభుత్వం మనస్ఫూర్తిగా సహకారం అందించిన దాఖలాలులేవు. నాడు చంద్రబాబునాయుడు ఎన్‌డీఏలో ఉన్న విషయం గమనార్హం. అటువంటప్పుడు నేడు రాష్ట్ర ప్రయోజనాలకు తిరిగి ఎన్‌డీఏలో చేరుతున్నామని చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ ప్రకటిస్తే రాష్ట్ర ప్రజలు నమ్మడానికి సిద్ధంగాలేరు. రాష్ట్రంలో ఉన్న మూడు ప్రధాన పార్టీలు ప్రాంతీయ పార్టీలు అయినా జాతీయ ప్రయోజనాలను కాపాడటంలో కీలకపాత్ర వహించవలసిన బాధ్యత ఉంది. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశ సమైక్యతకు, ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నాయి. ముస్లింలను, క్రిష్టియన్‌లను శత్రువులుగా చూడటం ఎంత ప్రమాదకరమో ఆలోచించవలసిన అవసరం ప్రతి ఒక్క రాజకీయ పార్టీకి ఉంది. గత కాంగ్రెస్ ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాలను అనుసరించిందని ఆరోపిస్తూ 2019లో రాజ్యాంగ విరుద్ధంగా ఆమో దించిన పౌరసత్వం సవరణ చట్టాన్ని ఎన్నికల ముందు అమలుకు తీసుకురావడం ఎంత దుర్మార్గమో ఆలోచించాలి. పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్, తదితర దేశాలలో మైనారిటీలుగా ఉన్న హిందువులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రిస్టియన్ శరణార్థులకు పౌరసత్వం ఇవ్వడానికి చట్టంచేసిన మోదీ, ముస్లిం ఛాందస భావాలను వ్యతిరేకించే, ప్రజా స్వామ్యాన్ని కోరుకునే ముస్లింలు నిర్బంధాలకు గురై భారతదేశం వస్తే వారికి మాత్రం పౌరసత్వం ఇవ్వరట. ముస్లింల పట్ల ఎంత విద్వేషాన్ని వెళ్ల గక్కుతున్నారో ఇది స్పష్టం చేస్తోంది. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు నిత్యం ముస్లింలపై దాడులు చేస్తున్నా, వ్యతిరేక హెచ్చరికలు చేస్తున్నా నోరు మెదపని మోదీని దేశ సమైక్యతకు పాటుపడతాడని నమ్మగలమా? చరిత్రలో హిందువులైన శైవులు, వైష్ణవులు దేవాలయాల విధ్వంసం, హత్యలు చేసుకున్న చరిత్ర ఉంది. హిందువులు బౌద్ధులను హత్యలుచేసి, వారి ఆరామాలను ధ్వంసంచేసి దేవాలయాలను కట్టిన చరిత్ర ఉంది. హిందూ దేవాలయాలను ముస్లింలు నేలమట్టం చేసిన చరిత్ర ఉంది. వందల సంవత్సరాల క్రితం జరిగిన ఈ చరిత్రను తిరగదోడి ముస్లింలను దోషులుగా, శత్రువులుగా చూడటం రాజ్యాంగ విరుద్ధం కాదా? అదే విధంగా రాజ్యాంగ బద్ధమైన ఫెడరలిజాన్ని విధ్వంసం చేయడానికి మోదీ పాలన దశాబ్దకాలంగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. నోట్లరద్దు, జీఎస్టీ బిల్లు, నిధుల పంపిణీ, ప్రణాళికా సంఘం రద్దు తదితర అంశాలన్నింటిపై రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోకుండా చట్టాలు చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదే.

అన్నిటికంటే అత్యంత ప్రమాదకరమైన ప్రతిపక్షం లేకుండా చేయాలని ప్రయత్నించగా, దేశాన్ని హిందూ మత రాజ్యంగా మార్చాలని ప్రయత్నించడం, కాంగ్రెస్ ముక్త భారత్‌తో ప్రారంభించి నేడు రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలనే రూపుమాపాలని కేంద్రప్రభుత్వం నిర్విరామంగా ప్రయత్నిస్తున్నది. ఆయా పార్టీలలో పదవీ వ్యామోహులను, అవినీతి పరులను ప్రలోభపెట్టి, డబ్బుపెట్టి కొనుగోలు చేయడం, లేదా సీబీఐ, ఇన్‌కంటాక్స్, ఈడీ సంస్థల చేత దాడి చేయించడం నిత్యం జరుగు తున్నది. మహారాష్ట్ర, బీహార్ నేడు జరుగుతున్న హిమాచలప్రదేశ్ తాజా ఉదాహరణలు. ఈ వాస్తవాలను కళ్లున్నా చూడ నిరాకరించి అధికారమే పరమావధిగా భావించి మోదీ ధృతరాష్ట్ర కౌగిలిని ఆలింగనం చేసుకుంటే టీడీపీలోనే 'ఏక్‌నాథ్‌షిండే' 'అజిత్‌పవార్' 'నితీశ్‌కుమార్'లను సృష్టించి వెన్నుపోటు పొడుస్తారన్న వాస్తవాన్ని చంద్రబాబు గ్రహిస్తే రాష్ట్రానికి, దేశానికి, టీడీపీకి మేలు జరుగుతుంది.

సెల్: 8121223457

# ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వీర్యం !

బొల్లిముంత సాంబశివరావు

దారిద్ర్య రేఖకు దిగువనున్న ప్రజలను ఆదుకునేందుకు చౌకధరలకు ఆహార ఉత్పత్తులు అందించేందు ప్రజా పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు, దాన్ని అమలు చేస్తున్నట్లు ప్రతి పాలక ప్రభుత్వం చెబుతూనే ఉంది. పాలకులు ఎంత ప్రచారం చేసినా వాస్తవాన్ని మభ్యపెట్టటం సాధ్యం కాదు. ఆహార పదార్థాలు అందక పేదలు ఆకలితో ఆహాకారాలు చేస్తూనే ఉన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ విఫలతతో పాటు, పేదల ఆర్థిక శక్తి పెరగక పోవటమే పేదరికానికి కారణం. ఇప్పటికీ దేశంలో పేదరికం 30% దాకా ఉంది. గ్రామీణ పేదలకు ఉపాధిని కల్పించే సేద్యపు భూమి లేక, కష్టపడేందుకు ఉపాధి లభించక, కుటుంబాలను పోషించే ఆధాయం రాక పేదరికంలో మగ్గుతున్నారు. తినీతినక పంటి బిగువుతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. పేదరికం తొలగించుకోవటానికి భూమి కోసం, ఉపాధి కోసం పేదలు ఉద్యమాలు చేపట్టారు. వలస పాలన నుంచే పేదలు ఆందోళనోద్యమాలు ప్రారంభించారు. అధికార మార్పిడి జరిగిన తర్వాత కూడా పేదల బ్రతుకుల్లో మార్పు ఏమి సంభవించలేదు. పేదల ఆందోళనలు తగ్గకపోగా పెరిగాయి. ఈ ఆందోళనల నేపథ్యంలో వచ్చిందే పాలకులు ప్రవేశపెట్టిన ప్రజా పంపిణీ వ్యవస్థ.

దేశం బ్రిటీష్ వలస పాలనలో వచ్చిన రెండవ ప్రపంచ యుద్ధం వలన ఆహార ధాన్యాల కొరత తీవ్రమై పేదలు ఆకలితో అలమటించారు. బ్లాక్ మార్కెట్ పెద్దఎత్తున కొనసాగింది. బ్రిటీష్ సైన్యాలకు కూడా ఆహార సమస్య తీవ్రమైంది. ఇలాంటి పరిస్థితుల్లో వలస పాలకులు ఆహార రేషన్ ప్రవేశ పెట్టారు. అధికార మార్పిడి తర్వాత కూడా పేదరికంతో పాటు తీవ్రమైన ఆహార కొరత ఏర్పడింది. 1960లో పేద, మధ్య తరగతి ప్రజలకోసం దేశ వ్యాపితంగా 50వేల రేషన్ షాపులు ఏర్పాటు చేశారు. అవి 1990–91 నాటికి 3లక్షల 50వేలకు పెరిగాయి. ఆహార ధాన్యాల పరిణామం 6.5 మిలియన్ల టన్నుల నుంచి 16 మిలియన్ల టన్నులకు పెరిగింది. దేశంలో పేదల సంఖ్య పెరుగుదలను ఇది సూచిస్తోంది. 1997లో ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)ను అధికారికంగా మార్చారు. కుటుంబాలను రెండు వర్గాలుగా విభజించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు (బీపీఎల్), ఎగువన ఉన్న వారు. బీపీఎల్ కేటగిరిలో ఉన్న వారికి మొదట కుటుంబానికి 10కిలోలు దాన్ని క్రమంగా 35కిలోలకు పెంచారు. ఎగువన ఉన్న వారి కుటుంబాలకు చౌకగా 15 కిలోలు, కొద్ది కాలం తర్వాత పూర్తిగా డబ్బులు చెల్లించారు. 2000 సంవత్సరంలో అంత్యోదయ పథకం వచ్చింది. దీన్ని కోటి నుంచి రెండు కోట్ల కుటుంబాలకు వర్తింప చేసినట్లు పాలకులు ప్రకటించారు. కుటుంబ సభ్యులతో సంబంధం లేకుండా ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం లేదా గోధుమలు ప్రకటించారు. 1993–94 నేషన్ శాంపిల్ సర్వే వినియోగ వ్యయ సర్వే నుంచి అంచనావేసి రాష్ట్రాల వారీగా పేదరికం లెక్కల నిష్పత్తుల అంచనా ప్రకారం రాష్ట్రాల్లో దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలను అంచనా వేశారు. అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఐఆర్‌డీపీ) 1992–03లో నిర్వహించిన సర్వే లెక్కలను వినియోగించింది. ఆ తర్వాత 2002లో ఆస్తులు, వృత్తి, భూ యాజమాన్యం మొదలైన 13 అంశాల పరిమితులపై బీపీఎల్ కుటుంబాలకు నిర్ణయంగా ప్రభుత్వం ప్రకటించింది. కుటుంబంలో ఉన్న ప్రతి వ్యక్తికి ఐదు కిలో బియ్యం లేదా గోధుమలు రేషన్‌గా నిర్ణయించారు. 1992–93 సర్వే పద్ధతి వలన బీపీఎల్‌లో ఉన్న కుటుంబాల కంటే తక్కువ గుర్తించారు. 2004–05 నాటికి 34% కుటుంబాలు మాత్రమే బీపీఎల్, ఏఏఐ కార్డులు అత్యంత సంపన్నులైన కుటుంబాల్లో 20నుంచి 25% వరకు కలిగి ఉన్నారంటే కార్డుల జారీలో అవినీతి ఎలా ఉందో వెల్లడైంది. నేషనల్ సెక్యూరిటీ యాక్ట్ అంచనా ప్రకారం 2020 నాటికి బీపీఎల్‌కు అర్హత ఉన్న కుటుంబాల్లో 59% మాత్రమే రేషన్ కార్డులు పొందగలిగారు. ప్రజా పంపిణీకి ధాన్య సేకరణకు నిధుల కొరత: వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆహార, ప్రజా పంపిణీకి రెండు విభాగాలు ఉన్నాయి. ఒకటి ఆహారం, ప్రజా పంపిణీ, రెండు వినియోగదారుల వ్యవహారాలు. ఆహార ధాన్యాల సేకరణ, నిల్వ, పంపిణీ ద్వారా ఆహార భద్రత నిర్ధారించటానికీ, చక్కెర రంగాన్ని నియంత్రించటానికి ఆహార, ప్రజా పంపిణీ వ్యవస్థ బాధ్యత వహిస్తోంది. ఇందుకు వినియోగదారుల మంత్రిత్వ శాఖ నిధులు కేటా యిస్తుంది. ఈ శాఖకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు జరుగు తాయి. వినియోగదారులకు హక్కుల గురించి అవగాహన కల్పించటం, వారి ప్రయోజనాలు పరిరక్షించటం, ప్రమాణాలను అమలు చేయటం, బ్లాక్‌మార్కెట్ ను నిరోధించటం వంటి బాధ్యతలను వినియోగదారుల విభాగం బాధ్యతగా ఉంటుంది. ఈ రెండు శాఖలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహిం చటంలో విఫమయ్యాయి. ఆహార పంపిణీకి 2020–21లో మంత్రిత్వ శాఖ 5,55,432 కోట్లు ఆహారం, ప్రజా పంపిణీ శాఖకు కేటాయించగా, 1921–22లో సవరించిన దానితో సహ 3,02,000 కోట్లకు తగ్గి, 2022–23 నాటికి 2,15,960కు పరిమితమైంది. ఇదే సంవత్సరాల్లో వియోగదారుల వ్యవహారాలకు 11,365 నుంచి 2,454కు, 1,725 కోట్లకు నిధులు తగ్గిపోయాయి. ఈ శాఖకు 30% నిధులు తగ్గగా, మొత్తం మీద ప్రజా పంపిణీ ఆహారం, ప్రజా పంపిణీ, మంత్రిత్వ శాఖ ద్వారా ఆహార సబ్సిడీకి ఎక్కువ నిధుల కేటాయింపుల జరుగుతున్నట్లు, అందుకు 96% ఖర్చు చేస్తున్నట్లు మంత్రిత్వ శాఖ లెక్కలు తెలుపుతున్నాయి. 2013 జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం ప్రభుత్వ నోటిఫైడ్ ధరలకు విక్రయించటానికి భారత ఆహార సంస్థకు (ఎఫ్‌సీఐ) రాష్ట్రాలకు సబ్సిడీ అందిస్తారు. ఈ చట్టం ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 75%, పట్టణ ప్రాంతాల్లో 50% జనాభా ప్రజా పంపిణీ వ్యవస్థ లో ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి, నిల్వ, పంపిణీకి, కార్య కలాపాల్లో కలిగే నష్టాన్ని రీఎంబర్స్‌మెంట్‌గా ఆహార సబ్సిడీ ఇస్తున్నది. మోదీ ప్రభుత్వం 2016–20 మధ్య సంవత్సరాల్లో భారత ఆహార సంస్థకు చెల్లింపుల కోసం డిపార్ట్‌మెంట్ తగిన కేటాయింపులు పొందినప్పటికీ, కేంద్ర బడ్జెట్ కోతల కారణంగా, ఎఫ్‌సీఐకి చెల్లించిన వాస్తవ మొత్తం చాలా తక్కువ. దాని బకాయిలను క్లియర్ చేయటానికి ఆహార సబ్సిడీ సరిపోనప్పుడు, అటు వంటి బకాయిలు వచ్చే సంవత్సరానికి బదలీ చేసినట్టు 'కాగ్' గమనించింది. బడ్జెట్ కోతల కారణంగా 2016–17 చివరి నాటికి ఉన్న 81,303 కోట్ల బకాయిలు 2019–20 నాటికి 2,43,779 కోట్లకు చేరాయి. ఎఫ్‌సీఐకి కేంద్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించక పోవటం వల్ల దాని కార్యక్రమాలకు ఆర్థిక సమస్యలు తీవ్రమైనాయి. బకాయిలు చెల్లించని కేంద్రం, ప్రజలు దాసుకున్న జాతీయ చిన్న మొత్తాల పొదుపు నుంచి రుణాలు అందించింది. 2019–20 మధ్య 2,54,600 కోట్ల విలువైన ఎన్ఎస్ఎస్ఎఫ్ రుణాలు ఎఫ్‌సీఐ వద్ద ఉన్నాయంటే ప్రజల సొమ్ము ఎలా మళ్లించారో అర్థమౌతుంది. రాష్ట్రాలపై మోపిన భారం: ఆహార ధాన్యాలు ప్రత్యక్ష కొనుగోలు నుంచి ఎఫ్‌సీఐని తొలగించిన మోదీ ప్రభుత్వం, కేంద్ర ప్రజా పంపిణీకి అవసరమై ధాన్యం ఎఫ్ సీఐకి అందించే బాధ్యత మిల్లర్లపై పెట్టింది. రాష్ట్రాల అవసరాలకు ధాన్య సేకరణ రాష్ట్ర ప్రభుత్వాలే సేకరించుకోవాలని, కేంద్రం సేకరించదని పేర్కొన్నది. ఈ భారమే కాకుండా బియ్యం, గోధుమల మద్దతు ధరలు పెరుగుదల కారణంగా ఆహార సబ్సిడీ బిల్లు కేంద్రానికి పెరిగిందని, ప్రజా పంపిణీ వ్యవస్థ కింద ఆహార ధాన్యాల సేకరణ, అమలు చేయటం అన్ని రాష్ట్రాల జాతీయ ఆహార భద్రతా చట్టం కింద సేకరించటం ద్వారా కేంద్ర కేంద్ర ప్రభుత్వ ఖర్చును కొంత భర్తీ చేయవచ్చని స్టాండింగ్ కమిటీ అభిప్రాయ పడింది. 15వ ఆర్థిక సర్వే కూడా ఆహార సబ్సిడీ బిల్లు కేంద్ర ప్రభుత్వానికి నిర్వహించలేని విధంగా ఉందని చెప్పింది. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు నిధులు తగ్గించటం, ఎఫ్‌సీఐ ని ధాన్య సేకరణ నుంచి తప్పించటం, రాష్ట్రాలే ధాన్య సేకరణ చేసుకోవటం, బీపీఎల్ కుటుంబాలను తగ్గించటం వలన మోదీ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నది.

సెల్: 9885983526

## ఎన్నికలకు ముందు సీఏఏ అమలు

# బీజేపీ మురికి రాజకీయాలకు నిదర్శనం

**న్యూఢిల్లీ :** పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలుపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలు బీజేపీ 'మురికి ఓటు బ్యాంకు రాజకీయాలకు' నిదర్శనమని, ఈ చట్టాన్ని రద్దు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన బుధవారం అన్నారు. 'ఇదో మురికి ఓటు బ్యాంకు రాజకీయం. పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వలసదారులకు పౌరసత్వం ఇచ్చి వారికి బీజేపీ బలహీనంగా ఉన్న నియోజకవర్గాల్లో ఆశ్రయం కల్పిస్తుంది. దీనివల్ల భవిష్యత్‌లో బీజేపీకి ఓటు బ్యాంకు పెరుగుతుంది. వారి రాజకీయ ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది' అని ధ్వజమెత్తారు. 'ఇప్పటికే దేశంలో ఉన్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం సమస్యలను పరిష్కరించకుండా కేంద్రం సీఏఏ గురించి మాట్లాడుతోంది. 2014కు ముందు భారత్‌కు వచ్చిన వారికి పౌరసత్వం ఇస్తామంటున్నారు. కాని ఒకసారి

### భారత్‌లోకి వలసలు పెరుగుతాయి

### ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

తలుపులు తెరిచిన తరువాత మిగిలినవారు ఊరుకుంటారా... పెద్ద సంఖ్యలో వలసదారులు భారతదేశంలోకి రావడం ప్రారంభిస్తారు. మూడు దేశాల్లో 30 మిలియన్లకు పైగా మైనారిటీలు నివసిస్తున్నారు. 15 మిలియన్ల మంది భారత్‌కు వచ్చినా వారు ఎక్కడ స్థిరపడతారు. వారికి ఉద్యోగాలు ఎవరు ఇస్తారు.

ఇది దేశానికి ప్రమాదకరం. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలు ప్రభావితం అయ్యే అవకాశముంది' అని అన్నారు. ఇప్పటికే బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసదారులు రావడం వల్ల అసోం ప్రజల భాష, సంస్కృతి ఇబ్బందుల్లో పడ్డాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టంతో కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుంచి

పెద్ద సంఖ్యలో పేద మైనారిటీలు భారత్‌లోకి వచ్చేందుకు తెరలేపిందని ఆయన విలేకరుల సమావేశంలో అన్నారు.'పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌లో 3.5 కోట్ల మంది మైనారిటీలు ఉన్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి పేద వలసదారులకు ఇక్కడ ఇళ్లు, ఉద్యోగాలు ఇవ్వడం ద్వారా మా ప్రజల డబ్బును ఖర్చు చేయాలని బీజేపీ కోరుకుంటోంది. మరి మన దేశ పౌరుల పరిస్థితి ఏమిటి' అని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ కేంద్రాన్ని ప్రశ్నించారు. పాకిస్తానీయులను మన దేశంలో స్థిరపరచడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. మన దేశ అభివృద్ధికి ఉపయోగించాల్సిన ప్రభుత్వ డబ్బును కేంద్రం పాకిస్తానీయుల స్థిరీకరణకు ఖర్చు చేయాల్సి వస్తుందని విమర్శించారు. సీఏఏను రద్దు చేయాలని దేశం డిమాండ్ చేస్తుందని, చట్టాన్ని రద్దు చేయకపోతే బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని ప్రజలను కోరారు.

## ఇది ప్రజలను విభజించే చట్టం

### సీఏఏకు వ్యతిరేకంగా కేరళ రాజ్‌భవన్ ముందు కాంగ్రెస్ ధర్నా

**తిరువనంతపురం :** వివాదాస్పద పౌరసత్వ (సవరణ) చట్టం-2019ని అమలు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బుధవారం ఇక్కడ రాజ్‌భవన్ ముందు ధర్నా నిర్వహించింది. ధర్నాను ఉద్దేశించి అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు వీడీ సతీశన్ మాట్లాడుతూ ప్రజలను మతపరంగా విభజించేందుకే బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం సీఏఏ నోటిఫికేషన్‌ను జారీ చేసిందని విమర్శించారు. 'కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పేదల బతుకులను బాగు చేసేందుకు అనేక చట్టాలు తీసుకొచ్చాం. కానీ బీజేపీ అధికారంలోకి వచ్చాక రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను విభజించేందుకు చట్టాలు చేసింది' అని అన్నారు. కాంగ్రెస్ న్యాయ పోరాటం చేస్తుందని, ఇందులో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. యూడీఎఫ్ కన్వీనర్, పార్టీ సీనియర్ నాయకుడు ఎం.ఎం.హసన్. సీడబ్ల్యూసీ సభ్యుడు, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్, అట్టింగల్ ఎంపీ అదూర్ ప్రకాశ్ సహా అనేక మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నాలో పాల్గొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 'సీఏఏను అరేబియా సముద్రంలో పడేస్తాం' అని థరూర్ తెలిపారు. 'కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడిగా ఇది నా మాట' అని అన్నారు. ఇదిలాఉండగా, ఇక్కడ జరిగిన కేపీసీసీ ఆఫీస్ బేరర్లు, డీసీసీ అధ్యక్షులు, రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుల సమావేశంలో సీఏఏపై చట్టపరమైన, రాజకీయ పోరాటాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. బుధవారం కేపీసీసీ తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన హసన్ మాట్లాడుతూ సీఏఏను ఉపసంహరించుకునే వరకు చట్టపరమైన, రాజకీయ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం మతపరమైన విభజన లక్ష్యంతో సీఏఏ నోటిఫికేషన్‌ను జారీ చేసిందని, ఈ రాజ్యాంగ విరుద్ధ చట్టం కోర్టులో నిలబడదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తెలిపారు. ఈ విషయంలో కేరళ వామపక్ష ప్రభుత్వం ద్వంద్వ ప్రమాణాలను అవలంభిస్తోందని ఆరోపించారు. కొన్ని సంవత్సరాల క్రితం సీఏఏకు వ్యతిరేకంగా యూడీఎఫ్ నిరసనలకు సంబంధించి వామపక్ష పాలన నమోదు చేసిన 800 కంటే ఎక్కువ కేసులను ఉపసంహరించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని సతీశన్ అన్నారు. ఇప్పుడు కూడా కేసులు నమోదు చేశారని, ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఈ కేసులను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

## సెమీకండక్టర్ల తయారీలో భారత్‌ను అగ్రగామిగా నిలుపుతాం: మోదీ

**న్యూఢిల్లీ:** రాబోయే రోజుల్లో భారత్ సెమీ కండక్టర్ల రంగంలో అగ్రగామిగా నిలుస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలకు ముందుచూపు లేకపోవడం వల్లే దేశంలో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమలు నెలకొల్పడంలో జాప్యం జరిగిందన్నారు. బుధవారం రూ.1.25 లక్షల కోట్లు విలువైన సెమీకండక్టర్ ప్లాంట్‌లకు ఆయన వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా గుజరాత్‌లో రెండు, అసోంలో ఒకటి చొప్పున సెమీకండక్టర్ ప్లాంట్‌లు ఏర్పాటుకానున్నాయి. 1960లో సెమీ కండక్టర్ల తయారీ కోసం భారత్ కలలు కన్నదని, అప్పటినుంచి దేశాన్ని పాలించిన ప్రభుత్వాలు వాటి ప్రాధాన్యాన్ని గుర్తించలేకపోయాయని మోదీ పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలకు తగినట్లు పెట్టుబడులు పెట్టలేకపోవడంతో ఈ రంగంలో భారత్ చాలా వెనకబడింది కానీ... బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా సెమీకండక్టర్ల తయారీకి సిద్ధమైందని చెప్పారు. ఇతరులపై ఆధారపడకుండా భారత్ స్వయంసమృద్ధిగా ఎదగడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుందని ప్రధాని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక.. రక్షణ, బీమా, టెలికాం రంగంలో ఎఫ్‌డీఐలను ఆకర్షించేందుకు సరళతరమైన విధివిధానాలు రూపొందించినట్లు ప్రధాని తెలిపారు. ప్రస్తుతం మొబైల్ తయారీలో భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశంగా నిలిచేందుకు ఇవి ఎంతో దోహదం చేశాయన్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమల ద్వారా దేశ యువత అధికంగా లబ్ధి పొందుతారని తెలిపారు. ఏఐ మిషన్‌లో భాగంగా సరికొత్త ఆవిష్కరణల కోసం భారత్ పనిచేస్తోందని, సాంకేతిక అభివృద్ధితోపాటు దాన్ని అమలుచేయడంపైనా కేంద్రం దృష్టి సారించిందన్నారు. కేంద్ర టెలికాం, ఐటీశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ... 2029 కల్లా ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్లు తయారుచేస్తున్న తొలి ఐదు దేశాల్లో భారత్ ఉంటుందన్నారు. గుజరాత్‌లోని ధోలేలో జరిగిన సెమీకండక్టర్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2026 కల్లా తొలి దేశీయ చిప్ టాటా ఎలక్ట్రానిక్స్ ప్లాంట్ నుంచి ఉత్పత్తి అవుతుందని వెల్లడించారు. ఈ ప్లాంట్ ద్వారా 27 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని చెప్పుకొచ్చారు.

# అంబుడ్స్‌మన్ లేకుండానే 228 వర్సిటీలు

### తెలుగు రాష్ట్రాల్లో ఆరు

### జాబితా విడుదల చేసిన యూజీసీ

**న్యూఢిల్లీ:** విద్యార్థుల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అంబుడ్స్‌మన్‌ను ఇంకా నియమించని విశ్వవిద్యాలయాల జాబితాను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) బుధవారం విడుదల చేసింది. అనేకసార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ అంబుడ్స్‌మెన్‌లను నియమించలేదంటూ 'డీఫాల్ట్ యూనివర్సిటీల జాబితా' పేరిట యూజీసీ జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో 159 రాష్ట్ర విశ్వవిద్యాలయాలు ఉండగా... మరో 67 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, 2 డీమ్డ్ విశ్వవిద్యాలయాలున్నాయి. వీటిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆరు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. అంబుడ్స్‌మన్‌లను 30రోజుల్లో నియమించాలని ఆదేశిస్తూ 2023 ఏప్రిల్‌లో యూజీసీ గెజిట్ జారీచేసింది. ఆ తర్వాత కూడా నోటీసులు పంపినప్పటికీ ఇంకా అంబుడ్స్‌మన్ నియమించని వర్సిటీల జాబితా ను తాజాగా యూజీసీ కార్యదర్శి మనీశ్ ఆర్.జోషీ విడుదల చేశారు. ఈ జాబితాలో ఉన్న యూనివర్సిటీలు అంబుడ్స్‌మన్‌లను నియమించినట్లయితే పూర్తి వివరాలను ఇ-మెయిల్ ద్వారా తెలియజేయాలని యూజీసీ పేర్కొంది. ఏదైనా వర్సిటీ, కళాశాల అంబుడ్స్‌మన్, ఫిర్యాదుల పరిష్కార కమిటీలను నియమించకపోతే సాధారణ ప్రజలు, విద్యార్థులు సైతం సమాచారం ఇవ్వొచ్చని యూజీసీ కార్యదర్శి తెలిపారు.

యూజీసీ విడుదల చేసిన జాబితాలో తెలుగు రాష్ట్రాల నుంచి ఆరు విశ్వవిద్యాలయాలున్నాయి. ఏపీలో మూడు, తెలంగాణ నుంచి మూడు చొప్పున ఉన్నాయి. వీటిలో ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ-విజయవాడ, క్లస్టర్ యూనివర్సిటీ -కర్నూలు, శ్రీ వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ- తిరుపతి, తెలంగాణలో కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ -వరంగల్, నిజాం ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్ మెడికల్ సైన్సెస్ -హైదరాబాద్, రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ-బాసర ఉన్నాయి.

## ఉత్తరాఖండ్ ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

**న్యూఢిల్లీ:** ఉత్తరాఖండ్ అసెంబ్లీలో ఫిబ్రవరి ఏడున ఆమోదించిన ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ఆమోదముద్ర వేశారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. మతంతో సంబంధం లేకుండా వివాహాలు, విడాకులు, భూములు, ఆస్తులు, వారసత్వ చట్టాలు అందరికీ ఒకేరీతిలో వర్తించేందుకు ఉద్దేశించిన ఈ బిల్లును ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ థామి గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టగా బిల్లు సభామోదం పొందింది. యూసీసీ ప్రకారం సహజీవనం సాగించడాన్ని కూడా రిజిస్టర్ చేయించుకోవాలి. బాల్య వివాహాలపై సంపూర్ణ నిషేధం ఉంటుంది. విడాకులకు సబంధించి యూనిఫాం విధానం అమల్లోకి వస్తుంది. అన్ని మతాల్లోని మహిళలకు ఆస్తిలో సమాన హక్కులను కల్పిస్తుంది. యువతులకు 18 ఏళ్లు, యువకుల వివాహ వయోపరిమితి 21 ఏళ్లుగా నిర్ధారించారు. వివాహాల రిజిస్ట్రేషన్ అన్ని మతాల వారికి తప్పనిసరి. రిజిస్ట్రేషన్ జరక్కుంటే ఆ వివాహం చెల్లదు. ఏడాది తర్వాత మాత్రమే విడాకుల పిటిషన్లను అనుమతిస్తారు. మాజీ చీఫ్ సెక్రటరీ సారథ్యంలోని తొమ్మిది మంది సభ్యుల కమిటీ యూజీసీ ముసాయిదాను రూపొందించింది.

## బీజేపీ అరుణాచల్ అభ్యర్థుల జాబితా విడుదల

**న్యూఢిల్లీ:** అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితాను బీజేపీ విడుదల చేసింది. మొత్తం 60 స్థానాలకు ఒకేసారి అభ్యర్థుల జాబితాను బుధవారం మధ్యాహ్నం ప్రకటించారు. ముఖ్యమంత్రి పెమా ఖండూ ప్రస్తుతం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ముక్తో సీటు నుంచే మళ్లీ పోటీలో దిగనున్నారు. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్‌ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 2019లో జరిగిన అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 41 సీట్లు గెలుచుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే.

## రామేశ్వరం కేఫ్ పేలుడు కేసు... పోలీసుల అదుపులో కీలక నిందితుడు!

**బెంగళూరు:** రామేశ్వరం కేఫ్ పేలుడు కేసులో కీలక నిందితుడిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అనుమానితుడిని కర్ణాటకలోని బళ్లారి జిల్లాకు చెందిన షబ్బీర్‌గా గుర్తించారు. నిందితుడి చిత్రాన్ని ఎన్ఐఏ గతంలోనే విడుదల చేసింది. అతడి ఆచూకీ కోసం పోలీసులు, అధికారులు గాలిస్తుండగా తాజాగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ నెల ఒకటిన రామేశ్వరం కేఫ్‌లో పేలుడు జరిగింది. అప్రమత్తమైన అధికారులు నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నాలు చేశారు. రెండు రోజుల తర్వాత నిందితుడిని గుర్తించారు. నిందితుడి సమాచారం ఇస్తే రూ.10 లక్షల రివార్డును ఎన్ఐఏ ప్రకటించింది. చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపింది. ఎన్ఐఏ విడుదల చేసిన చిత్రంలో అతడు టోపీ, నల్ల ప్యాంటు, నల్ల బూట్లు ధరించాడు. పేలుడు జరిగిన సమయంలో అక్కడ ఉన్న సీసీ కెమెరాలో నిందితుడిని పోలీసులు గుర్తించారు. పేలుడుకు టైమర్‌తో కూడిన ఐఈడీ పరికరాన్ని ఉపయోగించినట్లు పోలీసుల విచారణలో తేలింది.

# విశ్వాస పరీక్షలో నెగ్గిన హర్యానా సీఎం సైనీ

- విప్ జారీచేసిన జేజేపీ
- ఎమ్మెల్యే పదవికీ ఖట్టర్ రాజీనామా

**చండీగఢ్:** హర్యానా కొత్త ముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైనీ విశ్వాసపరీక్షలో నెగ్గారు. అసెంబ్లీలో విశ్వాసన తీర్మానం ప్రవేశపెట్టగా... మూజువాణి ఓటుతో విశ్వాస తీర్మానాన్ని సభ ఆమోదించింది. సైనీ బలపరీక్ష నిమిత్తం శాసనసభ బుధవారం ప్రత్యేకంగా సమావేశమైంది. ఉదయం సీఎం అసెంబ్లీలో విశ్వాస పరీక్ష తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనిపై సభలో చర్చ జరిపిన అనంతరం మూజువాణీ ఓటింగ్ చేపట్టారు. 48 మంది ఎమ్మెల్యేల మద్దతుతో సైనీ విజయం సాధించారు. దుష్యంత్ చౌతాలా నేతృత్వంలోని జననాయక్ జనతా పార్టీ (జేజేపీ)తో తెగతెంపులు చేసుకున్న తర్వాత మనోహర్ లాలా ఖట్టర్ ముఖ్యమంత్రి పదవికి మంగళవారం అనూహ్యంగా రాజీనామా చేయడం, ఆయనతో పాటు మంత్రివర్గ సభ్యులంతా రాజీనామాలు సమర్పించడంతో ఆయన స్థానంలో కురుక్షేత్ర నియోజకవర్గ ఎంపీ నాయబ్ సింగ్ సైనీ (54) కొత్త సీఎంగా వెంటనే బాధ్యతలు చేపట్టిన సంగతి విదితమే. లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు వ్యవహారంలో బీజేపీ, దాని భాగస్వామ్య పక్షమైన జేజేపీ మధ్య ఇటీవల విభేదాలు తలెత్తాయి. దీంతో ప్రభుత్వంలో భారీ మార్పులు జరగనున్నాయంటూ మంగళవారం నుంచి ఊహాగానాలు వెలువడ్డాయి. ఈ క్రమంలోనే ఖట్టర్ సహా 13 మంది మంత్రులు రాజీనామాలు చేయడం, గవర్నర్ బండారు దత్తాత్రేయ వెంటనే వాటిని ఆమోదించడం చకచగా జరిగిపోయాయి. ఆ వెంటనే శాసనసభా పక్షం సమావేశమై సైనీని తమ నాయకుడిగా ఎన్నుకుంది. ఆరుగురు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు బీజేపీ సర్కార్‌కు మద్దతు ప్రకటించారు. దీంతో జేజేపీ మద్దతు లేకుండానే బీజేపీకి మెజారిటీ చేకూరింది. వెంటనే సైనీతో గవర్నర్ దత్తాత్రేయ ప్రమాణ స్వీకారం చేయించారు.

### దుష్యంత్ చౌతాలా విప్

కాగా సైనీ విశ్వాస పరీక్ష సందర్భంగా ఓటింగ్‌కు దూరంగా ఉండాలని జేజేపీ అధినేత దుష్యంత్ చౌతాలా తమ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలకు విప్ జారీ చేశారు. అయితే విప్ జారీ చేసినప్పటికీ జేజేపీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు జోగి రామ్ సిహాగ్, ఐశ్వర్ సింగ్, రామ్‌కుమార్ గౌతమ్, దేవేంద్ర బబ్లి రాష్ట్ర అసెంబ్లీకి వచ్చారు. అయితే విశ్వాసపరీక్ష మొదలైన తర్వాత ఆ ఎమ్మెల్యేలు సభ నుంచి వెళ్లిపోవడం గమనార్హం. 90 స్థానాలున్న హరియాణా అసెంబ్లీలో బీజేపీకి 41 మంది ఎమ్మెల్యేలుండగా... జేజేపీకి 10 మంది సభ్యులున్నారు. కాంగ్రెస్‌కు 30, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ లోక్‌దళ్, హరియాణా లోక్‌హిత్ పార్టీకి చెరొక సభ్యుడు, ఏడుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఉన్నారు.

### ఎమ్మెల్యే పదవికీ ఖట్టర్ రాజీనామా

ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయిన మనోహర్ లాల్ ఖట్టర్ బుధవారం ఎమ్మెల్యేగానూ రాజీనామా చేశారు. ఈ విషయాన్ని ఆయన అసెంబ్లీలో వెల్లడించారు. "శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నా. ఇకపై నా కర్నాల్ స్థానం బాధ్యతలను మన కొత్త సీఎం సైనీ చూసుకుంటారు" అని అన్నారు. దీంతో ఉప ఎన్నికల్లో ముఖ్యమంత్రి అక్కడినుంచి పోటీ పడనున్నట్లు సూచనప్రాయంగా వెల్లడించారు. ప్రస్తుతం సైనీ కురుక్షేత్ర ఎంపీగా ఉన్నారు. ఇక, ఖట్టర్ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

## ఈసీల నియామకాలపై రేపు సుప్రీం అత్యవసర విచారణ



**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సీఈసీ, ఈసీల నియామకాల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రధాన ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషనర్ల నియామకాల కోసం కొత్తగా తీసుకొచ్చిన చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్ల అత్యవసర విచారణ చేపట్టాలని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) తాజాగా అభ్యర్థించింది. ఇందుకు అంగీకరించిన సర్వోన్నత న్యాయస్థానం ఈ నెల 15న విచారణ జరుపుతామని వెల్లడించింది. కేంద్ర ఎన్నికల సంఘంలో ఖాళీ అయిన కమిషనర్ల పోస్టులను ఈ నెల 15లోగా భర్తీ చేసేందుకు కేంద్రం సిద్ధమవుతున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత నెల ఒక కమిషనర్ అనూప్ చంద్ర పాండే పదవీ విరమణ చేశారు. ఇటీవల మరో కమిషనర్ అరుణ్ గోయెల్ అనూహ్యంగా రాజీనామా చేశారు. దీంతో ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఒక్కరే మిగిలారు. ప్రధాని మోదీ, కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత అధీర్ రంజన్ చౌధరి, కేంద్ర మంత్రి సభ్యులుగా ఉన్న ఎంపిక కమిటీ ఈ నెల 15లోగా కొత్త కమిషనర్ల పేర్లను ఖరారు చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. తాజా నియామకాలను సవాల్ చేస్తూ ఇటీవల కాంగ్రెస్‌కు చెందిన ఓ నేత సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఇది కూడా విచారణకు రానుంది.

## హౌరా లోక్‌సభ అభ్యర్థి ఎంపికలో సంతృప్తిగా లేను: బాబున్ బెనర్జీ

### పేర్ల వెల్లడిలో మమతకు చిక్కులు

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమబెంగాల్ నుంచి పోటీ చేసే అభ్యర్థుల పేర్లను వెల్లడించిన మమతా బెనర్జీకి చిక్కులు తప్పేట్టు లేవు. హౌరా లోక్‌సభ నియోజకవర్గానికి ప్రసూన్ బెనర్జీని తిరిగి నామినేట్ చేయడంపై మమతా బెనర్జీ చిన్న తమ్ముడు బాబున్ బెనర్జీ అసంతృప్తి వ్యక్తం చేశారు. అవసరమైతే హౌరా నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని చెప్పారు. ప్రస్తుతం న్యూఢిల్లీలో ఉన్న ఆయన బీజేపీలో చేరుతారనే ఊహాగానాలను కొట్టివేశారు.'హౌరా లోక్‌సభ సీటుకు అభ్యర్థి ఎంపిక విషయంలో నేను సంతృప్తిగా లేను. ప్రసూన్ బెనర్జీ సరైన ఎంపిక కాదు. ఎంతో మంది సమర్థులైన అభ్యర్థులను పక్కనపెట్టి ఆయన ఎంపిక జరిగింది. నన్ను అవమాన పరచేలా ప్రసూన్ మాట్లాడటం ఎప్పటికీ మరిచిపోలేను. మమతా బెనర్జీ నా వాదనతో ఏకీభవించరని తెలుసు. అవసరమైతే హౌరా లోక్‌సభ సీటుకు స్వంతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తాను' అని బాబున్ బెనర్జీ బుధవారం మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. బీజేపీలో చేరవచ్చంటూ వస్తున్న ఊహాగానాలను బాబున్ బెనర్జీ తోసిపుచ్చారు. అలాంటి ఉద్దేశాలేవీ లేవని చెప్పారు. 'నేను దీదీతోనే ఉన్నాను. దీదీతోనే ఉంటాను. మమతా బెనర్జీ ఉన్నంత వరకూ పార్టీని ఎన్నటికీ విడిచిపెట్టను, ఏ పార్టీలోనూ చేరను' అని స్పష్టం చేశారు. అయితే తనకు క్రీడలతో సంబంధం ఉన్నందున పలువురు బీజేపీ నేతలు తెలుసునని, వారితో సత్సంబంధాలు ఉన్నాయని చెప్పారు.

# పేదలకు ధరల సెగ...!

## 8.66 శాతానికి పెరిగిన ఆహార ద్రవ్యోల్బణం

**న్యూఢిల్లీ :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అస్తవ్యస్థ ఆర్థిక విధానాల ఫలితంగా పేద ప్రజలు పస్తులుండాల్సిన పరిస్థితి దాపురించింది. ధరలు నియంత్రించలేని పరిస్థితిలో కేంద్ర పాలకులు ఉండటం సిగ్గు చేటని వామపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. మంచి వేతనాలతో కూడిన ఉద్యోగాలు లేకపోవడంతో పాటు కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతూనే ఉండటంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్రవ్యోల్బణానికి సంబంధించిన తాజా గణాంకాలను పరిశీలిస్తే... ఫిబ్రవరిలో ఆహార ద్రవ్యోల్బణం జనవరిలో 8.30 శాతం నుంచి 8.66 శాతానికి పెరిగింది. ప్రధానంగా పాలు, చికెన్, గుడ్లు, చేపలు, ఇతర నిత్యావసర వస్తువులతో పాటు కూరగాయల ధరల పెరుగుదల కారణంగా ఆహార ద్రవ్యోల్బణం పెరిగింది. ఒక ఆంగ్ల వార్తా సంస్థ వివరాల ప్రకారం, నిర్దిష్ట ఆహార పదార్థాలలో ధరలలో భారీ పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోంది. టమాటాలు ధర గత నెలలో 42.01 శాతం పెరగడం ద్వారా జనవరిలో 38.01 శాతం పెరుగుదలను అధిగమించింది. ఫిబ్రవరిలో ఉల్లిపాయలు 22.1 శాతం ద్రవ్యోల్బణం రేటుతో దానిని అనుసరించాయి. అంతకు ముందు నెలలో 29.69 శాతంగా ఉన్నాయి. ఇక బంగాళాదుంపల ధరలు ఫిబ్రవరి 2023 నుంచి ప్రతికూలంగానే ఉన్నాయి. గత నెలలో 12.38 శాతానికి పెరిగాయి. వంకాయల ధరలు కూడా ఏడాది ప్రాతిపదికన 23 శాతం మేర పెరిగాయి.

### క్షీణించిన పారిశ్రామికోత్పత్తి

అదే సమయంలో తయారీ రంగంలో మందగమనం కారణంగా పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి డిసెంబరు 2023లో 4.2 శాతం నుంచి ఈ ఏడాది జనవరిలో 3.8 శాతానికి తగ్గింది. మంగళవారం (మార్చి 12) విడుదల చేసిన ప్రభుత్వ గణాంకాల ప్రకారం, తయారీ రంగం వృద్ధి ఒక నెల క్రితం 4.5 శాతం నుంచి 3.2 శాతానికి మందగించడం, వినియోగదారుల నాన్-డ్యూరబుల్స్ మూడు నెలల్లో రెండవసారి సంకోచంలోకి జారడంతో ఈ పరిస్థితి చోటుచేసుకుంది. ఎనిమిది ప్రధాన పరిశ్రమలు బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్ విద్యుత్. ఈ రంగాలు ఐఐపీలో 40 శాతం ఉన్నాయి. పారిశ్రామిక వృద్ధి ధోరణులకు కీలక సూచికగా పనిచేస్తాయి. కాగా, ఈ సంవత్సరం జనవరిలో మైనింగ్, విద్యుత్ ఉత్పత్తి వరుసగా డిసెంబరు 2023లో 5.2 శాతం, 1.2 శాతంతో పోలిస్తే 5.9 శాతం, 5.6 శాతం పెరిగాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఉత్పత్తి 10.9 శాతం పెరిగింది. ఇది మూడు నెలల్లో అత్యధిక వృద్ధి. కానీ జనవరి 2023లో వాటి ఉత్పత్తి 8.2 శాతం కుదించబడినందున ప్రాథమిక ప్రభావాల నుంచి లాభపడింది. ఇక మూలధన వస్తువుల ఉత్పత్తి జనవరిలో 4.1 శాతానికి పెరిగింది. మధ్యంతర వస్తువులు కూడా డిసెంబరు 2023లో 3.9 శాతంతో పోలిస్తే 4.8 శాతం వద్ద వేగంగా వృద్ధి చెందాయి. అయినప్పటికీ, ప్రాథమిక వస్తువులు, మౌలిక సదుపాయాలు/నిర్మాణ వస్తువుల వృద్ధి రేట్లు వరుసగా జనవరిలో 2.9 శాతం, 4.6 శాతానికి తగ్గాయి. పారిశ్రామిక ఉత్పత్తి సూచిక (ఐఐపీ) గణన కోసం జాతీయ గణాంకాల కార్యాలయం వివరాల ప్రకారం, 23 తయారీ విభాగాల్లో ఎనిమిది జనవరిలో సంకోచం నమోదయింది. కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్స్, ఆప్టిక్ ఉత్పత్తులు 11.9 శాతం బాగా పడిపోయాయి. అయితే ఫార్మాస్యూటికల్స్ ఉత్పత్తి గత జనవరి వరకు సమానంగా మరోవైపు, ఇతర రవాణా పరికరాలు 25.3 శాతం, తయారు చేసిన మెటల్ ఉత్పత్తులు 21.4 శాతం, వాహనాలు, ఫర్నిచర్ ఉత్పత్తి జనవరిలో వరుసగా 18 శాతం, 15.1 శాతం పెరిగాయి.

# మోదీ పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం

- బీజేపీ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తోంది
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- ప్రజల హక్కుల కోసం పోరాడే పార్టీ సీపీఐ: ముప్పాళ్ల

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం/వినుకొండ : కేంద్రంలో నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఈ నెల 14న దేశ వ్యాప్తంగా రైతు సంఘాల సమన్వయ కమిటీ అధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాల్లో లక్షలాది మంది రైతులు పాల్గొన్నబోతున్నట్లు ఆయన పేర్కొన్నారు. బుధ వారం సీపీఐ గుంటూరు జిల్లా జనరల్ బాడీ సమావేశం గుంటూరులోని మల్లయ్య లింగం భవనం నందు జరగ్గా... పల్నాడు జిల్లా వినుకొండలో పలనాడు జిల్లా సీపీఐ సర్వసభ్య సమావేశం జరిగింది. రెండు సమావేశాలకు హాజరైన సందర్భంగా రామకృష్ణ రెండు చోట్ల మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. బీజేపీ తీసుకొచ్చిన నల్ల వ్యవసాయ చట్టాలపై రైతులు సుదీర్ఘ పోరాటం చేసి విజ యం సాధించారన్నారు. అయితే మోదీ ప్రభుత్వం ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల్ని దృష్టిలో ఉంచుకొని ఆ చట్టాలను ఉపసంహరించుకున్నామని చెప్పిందన్నారు. కానీ నేడు మళ్లీ అవే అవే చట్టాలను అమలు చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు పంటకు మద్దతు ధరల్లో వారి ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం జోడించి ఇవ్వాలని, అలాగే దేశ వ్యాప్తంగా ఉన్న రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మన రాష్ట్రంలోని రైతు సంఘాలు నిరసనకు దిగనున్నాయని చెప్పారు. రైతు సంఘాలు చేపట్టే నిరసన కార్యక్రమానికి సీపీఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని తెలిపారు. కేంద్రంలో అధికా రంలో ఉన్న బీజేపీ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోకూడదని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సమన్లు ఇచ్చి బెదిరించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. టీడీపీ చంద్రబాబును అరెస్టు చేసే ధైర్యం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి లేదని... కానీ ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహకారంతో చంద్రబాబును 53 రోజులు జైల్లో పెట్టగలిగారని ఆయన ఆరోపించారు. ఎన్డీఏతో కలవడం చంద్రబాబుకు ఇష్టం లేకున్నప్పటికీ బీజేపీ బ్లాక్ మెయిల్ రాజకీయాల వల్ల కలవాల్సి వచ్చినట్లు తెలిపారు. 370 ఎంపీ స్థానాలు పక్కాగా గెలుచుకుం టామని గొప్పలు చెప్పుకుంటున్న మోదీ, అమిత్ షాలు బ్లాక్ మెయిల్ రాజకీయాలకు ఎందుకు పాల్పడుతున్నారని ప్రశ్నించారు. మీకు గట్టి నమ్మకం ఉంటే ఇతర రాజకీయ పార్టీలను ఎందుకు ఎన్డీఏలో చేరమంటున్నారని నిల దీశారు. మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే...ఇక మన దేశంలో రాజ్యాంగం అనేదే ఉండదని ఆందోళన వెలిబుచ్చారు. అలాగే భారతదేశ వ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ పార్టీల కార్యాలయాలకు తాళాలు వేసే పరిస్థితి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో దేశ రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి, లౌకికవాదాన్ని నిలబెట్టుకోవడానికి అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి...మతాన్ని అడ్డుపెట్టుకొని...మెజారిటీ మతస్తుల ఓట్లు పొందేందుకే నేడు బీజేపీ ప్రభుత్వం సీఏఏ నోటిఫికేషన్ జారీ చేసిందని విమర్శించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండు కూడా ప్రత్యక్షంగానూ... పరోక్షంగా బీజేపీ గూటికి చేరి...రాష్ట్ర అభివృద్ధి నిరోధకంగా మారాయన్నారు. ఆది నుంచి ప్రజాస్వామ్యం కోసం, ప్రజల హక్కుల కోసం త్రికరణ శుద్ధిగా పోరాడుతున్న పార్టీ సీపీఐ అని కొని యాడారు. తాము అధికారంలోకి వస్తే ఏపీ ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీలపై తొలి సంతకం చేస్తామని కాంగ్రెస్ పార్టీ చెబుతుంటే... మన రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలైన వైసీపీ, టీడీపీ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాలు కోసం మోదీ ముందు చేతులు కట్టుకుని కూర్చుంటున్నారని దుయ్యబట్టారు. బీజేపీతో పొత్తు పెట్టు కున్న టీడీపీ, వైఎస్సార్‌సీపీలను వ్యతిరేకిస్తూ ప్రజల పక్షాన పోరాడే సీపీఐని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలుపై ఉందన్నారు. 50 సంవత్సరాలు దాటిన బీసీలకు ఇస్తానన్న రూ.4 వేలు పెన్షన్‌ను రూ.6వేలు చొప్పున భార్యాభర్తలు ఇద్దరికీ ఇవ్వాలని సీపీఐ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు ముప్పాళ్ల పేర్కొన్నారు. తాను అధికారంలోకి వచ్చిన 6 నెలల లోపు అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తిగా న్యాయం చేస్తానని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి తన 5 సంవత్సరాల పాలనా కాలం పూర్తి కావొస్తున్నా ఆ మేరకు చేయలేదని దుయ్యబట్టారు. త్వరలో జరగనున్న ఎన్నికలకు నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఏవిధంగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారో... అదేవిధంగా రూ.2వేల కోట్లు అగ్రిగోల్డ్ బాధితులకు... చనిపోయిన బాధితుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మీడియా సమావేశాల్లో సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు సంద్రపాటి సైదా తదితరులు పాల్గొన్నారు.

## పౌరసత్వానికి మతం ఆధారం కాదు

- బీజేపీది విభజించి-పాలించు విధానం
- సీఏఏ నోటిఫికేషన్‌పై సీపీఐ

న్యూదిల్లీ: పౌరసత్వం పొందడానికి మతం ఎన్నడూ ఆధారం కాదని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తెలిపింది. బీజేపీది విభజించి, పాలించు విధానమని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం బుధవారం ఒక ప్రకటనలో విమర్శించింది. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) సవిరిత నిబంధనలను నోటిపై చేయడాన్ని ఆక్షేపించింది. ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)ను సుప్రీంకోర్టు ఆదేశించిన రోజునే ఆ నోటిఫికేషన్ జారీ చేయడం బీజేపీ కుట్రలో భాగమని దుయ్యబట్టింది. ఒకవైపు ఆశ్రిత పెట్టుబడిదారులు, కార్పొరేట్‌లకు రక్షణ కల్పించడమే కాకుండా వారు దేశాన్ని దోచుకునేందుకు సహకారాన్ని అందిస్తోందని... మరోవైపు ప్రజలను విభజిస్తోందని బీజేపీని విమర్శించింది. ఈ ప్రయత్నాల్లో భాగంగానే సీఏఏ నోటిఫికేషన్‌ను జారీ చేసిందని పేర్కొంది. మతం ఆధారంగా పౌరులను గుర్తించాలని రాజ్యాంగం చెప్పలేదని గుర్తుచేసింది. పౌరసత్వం ఇచ్చేందుకు మతం ఎప్పుడూ ఆధారం కాబోదని తెలిపింది. సీఏఏ నోటిఫికేషన్‌ను ఇప్పుడు జారీ చేయడం వల్ల మతం పేరిట ప్రజలను విభజించి వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందడమే బీజేపీ ఉద్దేశమని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం దుయ్యబట్టింది.

**రాజ్యాంగానికి విరుద్ధం: సీపీఎం**

పౌరులకున్న గుర్తింపును మతంతో ముడిపెట్టడం రాజ్యాంగానికి విరుద్ధమని సీఏఏనుద్దేశించి సీపీఎం తెలిపింది. ఎన్‌ఆర్సీకి ముడిపడిన సీఏఏ ముస్లింలలో తీవ్ర భయాందోళనలు రేకెత్తిస్తున్నదని ఓ ప్రకటన చేసింది. పొరుగుదేశాల నుంచి వచ్చే పౌరులు ముస్లిమేతరులైతేనే పౌరసత్వం ఇచ్చేలా వివక్షాపూరిత వైఖరికి సీఏఏ నాంది పలికిందని విమర్శించింది. ముస్లింలు లక్ష్యంగా ఈ చట్టం తీసుకువచ్చారని సీపీఎం పొలిట్ బ్యూరో ఆక్షేపించింది.

## అసంతృప్త నేతలకు బుజ్జగింపులు

- సీఎం జగన్ వరుస భేటీలు
- తాడేపల్లికి 'నగరి' పంచాయతీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీలో సీట్లు దక్కని అసంతృప్త ఎమ్మెల్యేలు, ఆశావహ నేతలతో సీఎం జగన్ భేటీ అయ్యారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి బుధవారం వివిధ ప్రాంతాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తరలివచ్చారు. వారితో పాటు నియోజకవర్గాల్లో సొంత కార్యకర్తల నుంచి అసమ్మతి ఎదుర్కొంటున్న వారిని పిలిపించారు. సత్తెనపల్లె, నరసారావుపేట, నగరి తదితర నియోజక వర్గాల్లో నెలకొన్న అసమ్మతి అంశాలపై సీఎం జగన్ చర్చించారు. సీఎం తన అధికారిక పర్యటనలను, సమీక్షలను మొత్తం రద్దు చేసుకుని వారితో చర్చించారు. దాదాపు 20 మందికి పైగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు క్యాంపు కార్యాలయానికి విచ్చేశారు. వారిలో ఎంపీ మార్గాని భరత్, ఎమ్మెల్యేలు హఫీజ్ ఖాన్, గోపిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దాడిశెట్టి రాజా, అదీప్‌రాజు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తదితరులున్నారు. వారితో సీఎం జగన్ నేరుగా చర్చించి, ఆయా నియోజకవర్గాల్లో ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 16న ఇడుపులపాయలో వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీల తుది జాబితా విడుదలకు జగన్ సిద్ధమయ్యారు. అంతకుముందే టికెట్లు దక్కని సిట్టింగ్ ఎమ్మెల్యేలను, ఆశావాహులను పిలిపించి, వారికి ప్రభుత్వం వచ్చాక, ఎమ్మెల్సీలు, నామినేటెడ్ తదితర అవకాశాలపై హామీ ఇస్తున్నారు. చిత్తూరు జిల్లా నగర పంచాయతీపైనా సీఎం దృష్టి పెట్టారు. క్యాంపు కార్యాలయానికి మంత్రి ఆర్కే రోజాను పిలిపించి, అక్కడి పరిస్థితిని చర్చించారు. అసెంబ్లీ ఇన్‌ఛార్జ్‌ల మార్పులు, చేర్పుల తర్వాత రాజకీయ పరిణామాలపై చర్చించారు. అందరూ కలిసి పనిచేయాలని ఆదేశించారు. కొద్ది రోజులుగా మంత్రి రోజాకు మళ్లీ టికెట్ ఇవ్వొద్దని ఆమె వ్యతిరేక వర్గం అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తోంది. రెండు రోజుల్లోగా మొత్తం ఈ అసమ్మతికి చెక్‌పెట్టి తుది జాబితా విడుదలపై జగన్ దృష్టి కేంద్రీకరించారు.

## 72మందితో బీజేపీ రెండో జాబితా

- నలుగురు కేంద్ర మంత్రులకు సీట్లు
- ఎంపీగా ఖట్టర్ పోటీ
- తెలంగాణ నుంచి ఆరుగురు

న్యూదిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ 72 మంది అభ్య ర్థులతో రెండో జాబితాను ప్రకటించింది. ఇందులో తెలంగాణ (6)తో పాటు దాద్రానగర్ హవేలీ (1) దిల్లీ (2), గుజరాత్ (7), హర్యానా (6), హిమాచల్‌ప్రదేశ్(2), కర్నాటక (20), మధ్యప్రదేశ్ (5), మహారాష్ట్ర(20), త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఒక్కొక్క స్థానానికి అభ్యర్థులను ఖరారు చేసింది. తెలంగాణ నుంచి పోటీ చేసే ఆరుగురు అభ్యర్థుల్లో ఆదిలాబాద్ - గోడెం నగేశ్, పెద్దపల్లి - గోమాస శ్రీనివాస్, మెదక్ - రఘునందన్‌రావు, నల్లగొండ - శానంపూడి సైదిరెడ్డి, మహబూబ్‌నగర్ నుంచి డీకే అరుణ, మహబూబాబాద్‌కు సీతారాం నాయక్ ఉన్నారు. రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. మొదటి జాబితాలో 9 మందిని ప్రకటించిన విషయం తెలిసిందే. మొత్తం ఇప్పటి వరకు 15 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన బీజేపీ... ఖమ్మం, వరంగల్ స్థానాలను మాత్రం పెండింగ్‌లో పెట్టింది. సైదిరెడ్డి, గోడెం నగేశ్, సీతారాం నాయక్ ఇటీవలే బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు. ఇటీవల 195 మందితో తొలి జాబితాను ప్రకటించిన బీజేపీ అధిష్ఠానం తాజాగా 72 మందితో రెండో జాబితాను విడుదల చేసింది. తాజా జాబితాలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, పీయూశ్ గోయల్, అనురాగ్ సింగ్ ఠాకూర్, మాజీ ముఖ్యమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, త్రివేంద్రసింగ్ రావత్, బసవరాజ్ బొమ్మై ఉన్నారు. బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు అనిల్ బలూనీ ఉత్తరాఖండ్‌లోని గర్వాల్ నుంచి పోటీకి దిగుతున్నారు. కాగా దిల్లీలో బీజేపీ ఇద్దరు కొత్త అభ్యర్థులను ప్రకటించింది. ఈస్ట్ దిల్లీ నుంచి హర్ష్ మల్హోత్రా, నార్త్‌వెస్ట్ దిల్లీ నుంచి యోగేంద్ర చందోలియా బరిలో నిలిచారు. కర్నాటకలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి ధర్వాడ్ నుంచి, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప తనయుడు బీవై రాఘవేంద్ర శివమొగ్గ నుంచి పోటీ చేస్తున్నారు. బీజేపీ యువజన విభాగం అధ్యక్షుడు తేజస్వీ సూర్య మరోసారి బెంగళూరు సౌత్ నుంచి పోటీకి దిగనున్నారు.

## ముక్తార్ అన్సారీకి యావజ్జీవం

- రూ.2 లక్షల జరిమానా
- మూడు దశాబ్దాల నాటి కేసులో వారణాసి కోర్టు తీర్పు

వారణాసి: ఉత్తరప్రదేశ్‌లో గ్యాంగ్‌స్టర్ నుంచి రాజకీయ నాయకుడి స్థాయికి ఎదిగిన ముక్తార్ అన్సారీకి మూడు దశాబ్దాల కిందటి గన్ లైసెన్స్ కేసులో యవజ్జీవశిక్ష పడింది. ఈ మేరకు వారణాసి ప్రత్యేక కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. ఈ కేసును ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు జడ్జి అవనీశ్ గౌతం విచారించారు. అన్సారీకి వివిధ పీనల్ కోడ్‌ల కింద రూ.2లక్షల జరిమానా కూడా విధించారు. ఈ మేరకు న్యాయవాది వినయ్ సింగ్ తెలిపారు. ఐపీసీలోని 467 (ఫోర్జరీ), 468 (మోసం చేసే ఉద్దేశంతో ఫోర్జరీ), 120 బీ (క్రిమినల్ కుట్ర)తో పాటు ఆయు ధాల చట్టంలోని సెక్షన్ల కింద 1990 డిసెంబరులో గాజీపూర్ జిల్లాలోని మహమ్మదాబాద్ పోలీసు స్టేషన్‌లో అన్సారీపై కేసు నమోదైనట్లు వెల్లడించారు. అన్సారీ ప్రస్తుతం బండా జైలులో ఉన్నారని, జైలు నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు విచారణకు హాజరయ్యారని న్యాయవాది తెలిపారు. కాగా, అన్సారీపై ఉత్తరప్రదేశ్, న్యూదిల్లీ, పంజాబ్‌తో పాటు అనేక రాష్ట్రాల్లో దాదాపు 60 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ఆయనకు కనీసం ఏడు కేసుల్లో శిక్ష పడిందన్నారు. న్యాయవాది సింగ్ మాట్లా డుతూ '1987, జూన్ 10న గన్ లైసెన్స్ కోసం గాజీపూర్‌లోని జిల్లా మెజిస్ట్రేట్‌ను అన్సారీ ఆశ్రయించారు. ఆ తర్వాత జిల్లా మెజిస్ట్రేట్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సంతకాలను ఫోర్జరీ చేసి లైసెన్సు పొందారు' అని తెలిపారు. ఈ మోసం బయటకు వచ్చిన తర్వాత ఆయనపై సీబీ-సీఐడీ కేసు నమోదు చేసింది. ఆయనతో పాటు మరో ఐదుగురిపై 1990, డిసెంబరు 4న కేసు పెట్టారు. 1997లో చార్జిషీటును అప్పటి ఆర్డినెన్స్ క్లర్క్ గౌరీశంకర్ శ్రీవాత్సవ, అన్సారీపై దాఖలైంది. శ్రీవాస్తవ మరణానంతరం ఆయనపై కేసును 1997లో కొట్టివేశారు. కాగా, అన్సారీ 1963లో జన్మించారు. ఆయన మవు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎన్నికయ్యారు. అన్సారీ చివరగా 2017 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు.

## బీజేపీ ఆటలు సాగనివ్వం: హిమాచల్ సీఎం సుఖు

శిమ్లా: రాష్ట్రంలో గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని జీర్ణించుకోలేని బీజేపీ... ధనబలంతో అధికారాన్ని దక్కించుకోవాలని చూస్తోందని హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు తీవ్రంగా విమర్శించారు. బుధవారం షిల్లాయ్ నియోజకవర్గంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... బీజేపీపై విమర్శలతో విరుచుకు పడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ సంక్షోభానికి బీజేపీయే కారణమని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి అధికారం దక్కించుకోవాలని ఆ పార్టీ ప్రయత్ని స్తోందన్నారు. గతంలో ఎన్నడూ జరగనివిధంగా ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుట్ర చేసిందని, అసంబద్ధంగా అధికారాన్ని దక్కించుకోవాలని ప్రయత్నించిందని మండి పడ్డారు. హిమాచల్ ప్రజలు అంతా గమనిస్తున్నారని... ఈ కుట్ర వెనక ఉన్నవారిని వారు క్షమించరని సుఖు అన్నారు. బీజేపీ ఆటలు సాగనీయబోమని... కాంగ్రెస్ ఐదేళ్లు అధికారంలో ఉంటుందన్నారు.

## కేరళకు కేంద్ర ఆర్థిక సాయంపై తొలగని ప్రతిష్టంభన

### సుప్రీంలో 21న తదుపరి విచారణ

న్యూదిల్లీ: ఆర్థిక సంక్షోభం వేళ కేంద్రప్రభుత్వం మొండిచేయి చూపుతుండటంతో సుప్రీంకోర్టును కేరళ ఆశ్రయించింది. తమ రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలలో కేంద్రం తలదూరుస్తోందని, ఖర్చులను నియంత్రించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించింది. అరకొర సాయం ద్వారా చేతులు దులుపుకోవాలని యత్నిస్తోందని దుయ్యబట్టింది. కేరళలో ఆర్థిక సంక్షోభం వేళ తక్షణ సాయంగా రూ.5వేల కోట్లు మాత్రమే ఇస్తామని కేంద్రప్రభుత్వం తేల్చిచెప్పింది. దీంతో బుధవారం సుప్రీంకోర్టులో కేరళకు, కేంద్రానికి మధ్య వాదోపవాదనలు జరిగాయి. కేంద్రం ఇస్తాన్నది ఏ మాత్రం సరిపోదని, కనీస అవసరాలనూ తీర్చలేదని కేరళ వెల్లడించింది. పింఛన్లు, వేతనాలకూ సరిపోదని పేర్కొంది. ఈ కేసును జస్టిస్ సూర్యకాంత, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. కేరళ తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, సీకే శశి వాదనలు వినిపించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తొలి తొమ్మిది నెలల రుణ పరిమితి నుంచి రూ.5వేల కోట్లను మినహాయిస్తామని కేంద్రం చెప్పింది. ఇప్పుడు రూ.5వేల కోట్లు తీసుకుంటే 2024-25లో 'అడ్ హాక్'కు అనుమతి ఉండదని తెలిపింది. అంటే రాష్ట్ర ఖర్చులను నియంత్రించే ప్రయత్నాన్ని కేంద్రం చేస్తోంది అని సిబల్ వాదించారు. కేంద్రప్రభుత్వ ప్రతిపాదనను కేరళ తిరస్కరించిందన్నారు. కనీసం రూ.10వేల కోట్లు రాష్ట్రానికి అవసరమని, రూ.5వేల కోట్లు అక్కరకు రావన్నారు. తమ రుణ పరిస్థితి, ఆర్థిక వ్యవహారాల్లో కేంద్రం జోక్యం ఫెడరలిజం సిద్ధాంతాలకు విరుద్ధమన్నారు. కేంద్రప్రభుత్వంపై కేరళ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సర్వోన్నత న్యాయస్థానం విచారించింది. బహుళ ఇంతకుముందు ఇలాంటి ఫిర్యాదు సుప్రీంకోర్టు వద్దకు రాలేదని జస్టిస్ కాంత్ అన్నారు. తొలుత ఇరు వర్గాలు చర్చించి ఈ సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. అయితే కేంద్రప్రభుత్వ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ తమ వైఖరిని స్పష్టం చేయగా 'ఇక చర్చలు ముగినట్టే కదా' అని జస్టిస్ కాంత్ అన్నారు. వాదనలు విన్న తర్వాత తదుపరి విచారణను ఈనెల 21కు వాయిదా వేశారు.





## స్టాక్ మార్కెట్లకు భారీ నష్టాలు

- సెన్సెక్స్ 900 పాయిట్లు కిందకు
- రూ.13 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ నష్టాలు చవిచూశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు- ఒక్కసారిగా పతనమయ్యాయి. ముఖ్యంగా రిలయన్స్, ఎన్టీపీసీ, ఎల్‌అండ్‌టీ వంటి ప్రధాన షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. సెబీ చీఫ్ వ్యాఖ్యల నేపథ్యంలో స్మాల్, మిడ్ క్యాప్ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 5 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 4 శాతం చొప్పున నష్టపోయాయి. బీఎస్ఈలో మదుపరుల సంపదగా పరిగణించే నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.13 లక్షల కోట్లు ఆవిరైంది. ఒక సమ యంలో సెన్సెక్స్ వెయ్యికిపైగా పాయింట్లతో నష్టాల్లో ట్రేడ్ అయింది. చివరకు 900 పాయింట్లకుపైగా నష్టంతో ముగిసింది. నిఫ్టీ 22 వేల దిగువకు చేరింది. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సెన్సెక్స్ 11 గంటల తర్వాత నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 72,515.71 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 906.07 పాయింట్ల నష్టంతో 72,761.89 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 338 పాయింట్లు నష్టంతో 21,997.70 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 82.85గా ఉంది.

కాగా సెన్సెక్స్ 30 ప్యాక్‌లో ఐటీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ మహీంద్రా, నెస్లే ఇండియా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, టాటా స్టీల్, టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 82.98 డాలర్ల వద్ద, బంగారం ఔన్సు 2,163 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి. స్టాక్ మార్కెట్లో పలు చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్ల ధరలు పెరుగుతూ వస్తున్నాయని, అవి ఏమాత్రం సహేతుకంగా కనిపించడం లేదని మార్కెట్ల నియంత్రణ సంస్థ- సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పురి బచ్ ఇటీవల తెలిపారు. ఈ క్రమంలోనే ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్స్ స్మాల్‌క్యాప్ సెగ్మెంట్‌లో కొత్త సబ్‌స్క్రిప్షన్‌ను తాత్కాలికంగా నిలిపివేసింది. కొన్ని బ్రోకరేజీ సంస్థలు, ఇన్వెస్టర్లు కూడా సెబీ చీఫ్ వ్యాఖ్యలను సమర్థించడం వల్ల ఆయా స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది.

# మావైపు జాప్యం లేదు

- జమ్మూకశ్మీర్‌లో ఎన్నికల నిర్వహణపై సీఈసీ
- దేశంలో ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చూస్తాం...
- ఎన్నికల బాండ్లపై గడువులోగా వివరాలు వెల్లడిస్తాం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను కలిసి లేదా విడివిడిగా నిర్వహించడంపై ఎన్నికల సంఘం భద్రతా పరిస్థితి, భాగస్వాముల అభిప్రాయాన్ని సమీక్షిం చిన తర్వాత నిర్ణయం తీసుకుంటుందని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ బుధవారం ఇక్కడ తెలిపారు. దేశంలో 2024 లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధంగా ఉందని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూస్తామని అన్నారు. అలాగే ఎన్నికల బాండ్లపై గడువులోగా వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో 'జాప్యం' గురించి వచ్చిన విమర్శలను కూడా ఆయన తిరస్కరించారు. డిసెంబరు 2023 నాటికి మాత్రమే డీలిమిటేషన్, అవసరమైన శాసన ప్రక్రియలు పూర్తయ్యా యని చెప్పారు. 'మార్పులు డిసెంబరు 2023లో జరి గాయి. మనం మార్చిలో ఉన్నాం. బాధ్యతలు మాకు తెలుసు. రాజకీయ శూన్యత ఉండకూడదని, ఎన్నికలు త్వరగా నిర్వహించాలని కూడా మాకు తెలుసు' అని జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలకు సంసిద్ధతను అంచనా వేసేందుకు ఆయన తన మూడు రోజుల పర్యటనను ముగించే ముందు విలేకరులతో అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలను నిర్వహిం చడంపై రాజకీయ పార్టీలు, భద్రతా సంస్థలు, పరిపాలన యంత్రాంగంతో సహా భాగస్వాముల కమిషన్ అభిప్రాయాన్ని తీసుకుందని ఆయన చెప్పారు. 'రెండు ఎన్నికలు కలిసి జరుగుతాయా లేక ఒకదాని తర్వాత ఒకటిగా జరుగుతాయా అనే అంశంపై మేము సమీక్షిం చాము. భద్రతా పరిస్థితిని సమీక్షించి, అభిప్రాయాన్ని తీసుకున్న తర్వాత మేము నిర్ణయిస్తాం' అని తెలిపారు. 'భద్రత ఎంత అవసరమో మేము అందరి నుంచి అభిప్రా యాన్ని తీసుకున్నాం. ప్రతి అభ్యర్థికి భద్రత అవసరం (జమ్మూకశ్మీర్‌లో). అందువల్ల అది (కలిసి ఎన్నికలు నిర్వహించడం) భద్రతాపరమైన చిక్కులను కలిగి ఉం టుంది' అని సీఈసీ అన్నారు. అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికలపై కూడా కమిషన్ అంతే శ్రద్ధ వహిస్తోందన్నారు. 'మేము జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల ప్రతి నిధులతో సమావేశమయ్యాం. అసెంబ్లీ ఎన్నికల నిర్వ హణలో జాప్యం గురించి ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికల సంఘం ఎలాంటి జాప్యం చేయలేదని నేను స్పష్టం చేయాలనుకుంటున్నాను' అని రాజీవ్ కుమార్ తెలిపారు. జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2019లో వచ్చిం దని, ఆ తర్వాత 2022లో డీలిమిటేషన్ కమిషన్ దాని కసరత్తును పూర్తి చేసిందని తెలిపారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ నివాసితుల కోసం 24 సీట్లతో సహా అసెంబ్లీ సీట్లను 107 నుంచి 114కి పెంచాలని సిఫారసు చేసిం దని ఆయన అన్నారు. 'ఇప్పుడు మనకు 90 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇందులో తొమ్మిది స్థానాలు షెడ్యూల్డ్ తెగలకు రిజర్వ్ అయ్యాయి. జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం, డీలిమిటేషన్ మధ్య వైరుధ్యం ఉన్నందున ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదు. మేము వారిని ఏకతాటిపైకి తీసుకురావాలి. అది డిసెంబరు 2023లో జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) చట్టం రూపంలో జరిగింది' అని చెప్పారు. సవరించిన చట్టంలో ఒక మహిళతో సహా వలసదారులకు రెండు సీట్లు రిజర్వ్ చేయాలని డీలిమిటేషన్ కమిషన్ సిఫార్సు కూడా ఉంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి స్థానభ్రంశం చెందిన వ్యక్తుల కోసం ఒక నామినేషన్‌కు మరొక నిబంధన కూడా చేర్చడం జరిగిందన్నారు.

**ఎస్‌బీఐ నుంచి ఎన్నికల బాండ్ల వివరాలు అందాయి**

ఎన్నికల బాండ్ల వివరాలను భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్‌బీఐ) నుంచి ఎన్నికల సంఘం స్వీకరించిందని, సకాలంలో సంబంధిత సమాచారాన్ని అందజేస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం, మార్చి 15 సాయంత్రం లోగా వీటిని ఈసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాల్సి ఉంది. 'మార్చి 12 నాటికి ఎస్‌బీఐ ఎన్నికల బాండ్ల వివ రాలు అందించాల్సి ఉంది. అది మాకు చేరింది. ప్రజలకు అన్ని వివరాలు వెల్లడిస్తాం. కమిషన్ అనేది పారదర్శకతకు ఎప్పుడూ అనుకూలమే. గడువులోగా దాన్ని బహిర్గతం చేస్తాం' అని అన్నారు. జమ్మూకశ్మీర్‌లో లోక్‌సభ ఎన్నికల సంసిద్ధతపై సమీక్ష నిర్వహించిన అనంతరం రాజీవ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. '2024 లోక్‌సభ ఎన్ని కలకు మేం సిద్ధంగా ఉన్నాం. స్వేచ్ఛాయుత, నిష్పక్ష పాతంగా ఎన్నికలు జరిగేలా చూస్తాం. ఈ ప్రజాస్వామ్య పండగలో ప్రతిఒక్కరూ ఎంతో ఆసక్తిగా పాల్గొనాలని జమ్మూ కశ్మీర్‌తో సహా దేశవ్యాప్తంగా ఉన్న ఓటర్లందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం' అని సీఈసీ రాజీవ్‌కుమార్ తెలిపారు. తప్పుడు వార్తలపై ఎప్పటికప్పుడు స్పందించేందుకు గాను ప్రతీ జిల్లాలో ఒక సోషల్ మీడియా సెల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అభ్యర్థులందరికీ సరైన భద్రత సమకూర్చడంతో పాటు కేంద్ర బలగాలను దించుతామన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఆన్‌లైన్ నగదు బదిలీపైనా పర్యవేక్షణ ఉంటుందన్నారు. 85 ఏళ్లు పైబడిన వారు, వైకల్యం ఉన్నవారు జమ్మూకశ్మీర్‌లో ఇంటి వద్ద ఓటు వేసే సౌకర్యం కల్పిస్తామని ఆయన తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.